

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 3 సెప్టెంబరు 2025







నిర్ణయాలపై.. నీలినీడలు

- కోరం లేకుండానే కీలక తీర్మానాలు
- ఎన్జీ రంగా యూనివర్సిటీలో వింత పరిస్థితి
- ధ్వజమెత్తుతున్న విశ్రాంత వీసీలు, రిజిస్ట్రార్లు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత ఏడాది తీసుకున్న కీలక నిర్ణయాలను కోరం లేకుండానే ఆమోదించారు. దీంతో ఆయా తీర్మానాలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 2024-2025 మధ్యలో జరిగిన సమావేశాల్లో తీసుకున్న అనేక నిర్ణయాలపై వర్సిటీలో పనిచేస్తున్న ఓ ప్రొఫెసర్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు బహిర్గతమైన తర్వాత పలువురు విశ్రాంత వీసీలు, రిజిస్ట్రార్లు స్పందిస్తూ కోరం లేకుండా తీసుకున్న నిర్ణయాలు చట్ట వ్యతిరేకమేనని తెలిపారు. ఆయా తీర్మానాల్ని వెనక్కి తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. కోరం కావాలంటే కనీసం ఆరుగురు సభ్యులు వర్సిటీ పాలక వర్గ సమావేశంలో పాల్గొనాలి. అయితే కేవలం ఐదుగురు సభ్యులతోనే కీలకమైన తీర్మానాలు ఆమోదింపజేశారు. సెక్రటరి హోదాలో సమావేశం ఏర్పాటుకు మాత్రమే పరిమితం కావాల్సిన రిజిస్ట్రార్‌ను కూడా కోరం జాబితాలో చూపించారు. ప్రొసీడింగ్ 315 ప్రకారం 2024 డిసెంబరు 20న జరిగిన సమావేశంలో 10484 తీర్మానం ప్రకారం ఆరు కొత్త కార్లు కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో కేవలం వీసీ మాత్రమే భౌతికంగా పాల్గొనగ, మిగిలిన నలుగురు (వివిధ శాఖల అధికారులు) జూమ్‌లో పాల్గొన్నట్లు రికార్డ్ చేశారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించినా (మిగతా 8వ పేజీలో)

ఆర్థిక కమిటీనే లేదు..

చట్టం ప్రకారం వర్సిటీ ఆర్థిక కమిటీని ఏర్పాటు చేయాలి. అందులో వీసీతో పాటు, కంప్ట్రోలర్, పాలక మండలి నుంచి ఇద్దరు సభ్యులు ఉంటారు. వర్సిటీకి చెందిన ప్రతీ ఆర్థిక వ్యవహారం ఆ కమిటీ ఆమోదం మేరకు మాత్రమే జరగాలి. గడచిన రెండేళ్లుగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అసలు ఆర్థిక కమిటీనే ఏర్పాటు చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఓ కీలక అధికారి కూడా అంగీకరించారు.

వీడని వరద

కృష్ణమ్మను వరద వీడనం టోంది. కృష్ణానదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలతో ఉరుకులు.. పరుగులతో ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఎగువ నుంచి వస్తోన్న నీటిని వచ్చినట్లుగా విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ సాగరం దిశగా పయనిస్తోంది. నాగార్జునసాగర్ జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 585.80 అడుగులు ఉంది. ఇదే విధంగా పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. దీంతో అటు సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు గేట్లు ఎత్తి నీటిని దిగువనకు వదులుతున్నారు. దీంతో కృష్ణమ్మ పుష్కరఘాట్లను ముంచు తూ.. కట్టలను తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటివరకు 597 టీఎంసీల నీరు సముద్రంలో కలిసినట్లు సమాచారం. జూలై 29 నుంచి నాగార్జున సాగర్ జలా శయం నుంచి నీటి విడుదల కొనసాగు తోంది. ఇప్పటి వరకు సాగర్ నుంచి దిగువకు 68,51,872 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో వైపు పంటల సాగుకు పుష్కలంగా డ్యాం నుంచి నీటి విడుదల చేస్తున్నారు.

సాగర్ గేట్లు బంద్

శ్రీశైలం నుంచి వరద తగ్గడంతో మంగళవారం రాత్రి 9 గంటలకు సాగర్ క్రస్ట్ గేట్లను అధికారులు మూసి వేశారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో సాయంత్రం 5 గంటలకు 18 గేట్లకు తగ్గించారు. ఆ తర్వాత 7 గంటలకు 8 గేట్లు ఆపగా 9 గంటలకు గేట్లన్నిం టినీ పూర్తిగా మూసివేశారు.

నిండుకుండల్లా జలాశయాలు

- నదిలో పెరుగుతోన్న ప్రవాహం
- నాగార్జున సాగర్‌లో 585.80 అడుగుల్లో నీరు
- ఇప్పటివరకు 597 టీఎంసీల కృష్ణాజలాలు కడలికి..


అరవింద వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

(నరసరావుపేట, విజయపురిసౌత్, రెంటచింతల, తాడేపల్లి టౌన్, అచ్చంపేట, అమరావతి, ఆంధ్రజ్యోతి)

అల్పపీడన ప్రభావంతో కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదిలో మళ్లీ వరద ప్రవాహం పోటెత్తింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని వచ్చింది వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. గత 15 రోజుల నుంచి నదిలో నీటి మట్టం భారీగా పెరిగింది. వరద ప్రభా వంతో ఘాట్లు నీటమునిగాయి. దీంతో ఎక్కడి కక్కడ రెవెన్యూ, పోలీసు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నదిలోకి ఎవరూ దిగకుండా పర్యవేక్షిస్తున్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనాలతో నదీ తీరంలో బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. ఆగస్టు నెల ప్రారంభం నుంచి నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. కొన్ని దగ్గర్ల అయితే ప్రవాహం ప్రమాదకర (మిగతా 8వ పేజీలో)

చప్టాలపై ప్రవాహం..

కొల్లూరు: నదిలో మళ్లీ వరద పోటెత్తడంతో పలు ప్రాంతాల్లో చప్టాలపైగా ఉధృతంగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొల్లూరు మండలం అరవింద వారధి ఎగువున గండిలో నుంచి వరద నీరు పెసర్లంక, ఆవులవారిపాలెం గ్రామాలను చుట్టుముడుతోంది. దోనేపూడి కరకట్ట దిగువున ఉన్న పోతార్లంక చప్టాపై నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నదికి వస్తున్న వరదతో లంక గ్రామాల ప్రజలు వణికిపోతున్నారు. పలు ప్రాంతాల్లో తీరంలో, లంకల్లోని పంటలను కూడా ముంచేస్తోందని రైతులు ఆందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.


నడికూడి: లో లెవల్ చప్టాపై నుంచి పారుతున్న నీరు

10న నాయుడమ్మ అవార్డు ప్రదానోత్సవం

కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజుకు అవార్డు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ స్మారక అవార్డు ప్రదానోత్సవం ఈ నెల 10న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరుగుతుందని అవార్డు కమిటీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు తెలిపారు. సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ కార్యాలయంలో మంగళవారం అవార్డు ప్రదానోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజుకు ఈ ఏడాది నాయుడమ్మ పేరిట అందచేస్తామన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన నాగరాజు ఐఏఎస్‌గా ఎంపికై ఉన్నతస్థాయికి ఎదిగారని తెలిపారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అవార్డు ప్రదానోత్సవానికి హాజరవుతారని తెలిపారు. అవార్డు కమిటీ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ లెదర్ టెక్నాలజీ శాస్త్రవేత్తగా తోలు పరిశ్రమకు గౌరవ ప్రథమైన స్థానం డాక్టర్ నాయుడమ్మ కల్పించారన్నారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగినా, గ్రామాలంటే ఆయనకు ఎంతో మమకారమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అయినాల మల్లేశ్వరరావు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రఘునాథబాబు, సుబ్రహ్మణ్యం

బార్లకు మరోసారి

- 14 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 15న కలెక్టరేట్లలో లాటరీ ప్రక్రియ

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యాపారుల నుంచి స్పందన లేక.. రెండు సార్లు వాయిదా వేసినా



గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అత్యధిక బార్లకు వ్యాపారుల నుంచి స్పందన రాలేదు. దీంతో నిబంధనల ప్రకారం నాలుగు దరఖాస్తులు వచ్చిన బార్లకు ఇటీవల అధికారులు లాటరీ తీసి బార్ల నిర్వహణకు అనుమతి ఇచ్చారు. ఈ క్రమంలో మిగిలిన బార్లకు మరోసారి దరఖాస్తు ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో గుంటూరు జిల్లాలో 67 బార్లకు, పల్నాడు జిల్లాలో 30 బార్లకు, బాపట్ల జిల్లాలో 15 బార్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు గుంటూరు డీసీ డాక్టర్ శ్రీనివాసులు, బాపట్ల ఈఎస్ ఆయేషాబేగం మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం నుంచి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరిస్తామన్నారు. 15న కలెక్టరేట్లలో దరఖాస్తుదారుల సమక్షంలో బార్లకు లాటరీ నిర్వహిస్తామన్నారు.

బర్లీ నిధులు విడుదల

- తొలి విడతలో రూ.52 కోట్లు
- రైతుల ఖాతాల్లో జమవుతున్న డబ్బులు
- మరో వారంలో మలివిడత నిధులు విడుదల

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించి తొలివిడత నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం రాత్రి నుంచే ఖాతాల్లో నగదు జమవుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బర్లీ పొగాకు సంక్షోభం నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. దాదాపు రెండు నెలలుగా ఈ ప్రక్రియ జరుగుతుండగా నగదు కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తొలివిడతలో బాపట్ల జిల్లాకు సంబంధించి రూ.22 కోట్లు, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు కలిపి రూ.30 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. మరో వారం రోజుల్లో మలివిడత నిధులు జమ అవుతాయని మార్క్‌ఫెడ్ చెబుతోంది. దశల వారీగా బర్లీ పొగాకు కొనుగోళ్లకు సంబంధించిన నిధులు జమ చేస్తామని రైతులు ఎవరూ కంగారు పడొద్దని మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. నాలుగు జిల్లాల పరిధిలో దాదాపు రూ.110 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా, తొలి విడతలో రూ.52 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

కాల్వలకు.. రూ.7.32 కోట్లు

- బకింగ్‌హామ్, గుంటూరు చానల్ బలోపేతం
- ఎన్నికల్లో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు నిధులు విడుదల

మంగళగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీసీ ప్రభుత్వం గాలికొదిలేసిన కాల్వల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. గత ఎన్నికల ప్రచారం సందర్భంగా నియోజకవర్గ పర్యటనలో సాగునీటి ఇబ్బందులను పలువురు రైతులు నారా లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో నాడు ఇచ్చిన హామీ మేరకు తాజాగా నియోజకవర్గ పరిధిలోని బకింగ్ హామ్ కాల్వ, గుంటూరు ఛానల్‌పై లాకులు, కట్టల బలోపేతానికి జలవనరులశాఖ రూ.7.32 కోట్లను విడుదల చేస్తూ మంగళవారం జీవో 450ని విడుదల చేసింది. డెల్టా ఆధునికీకరణలో భాగంగా అత్యవసరమైన పనుల ద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులను తప్పించే లక్ష్యంతో మంత్రి లోకేశ్ ఈ నిధులను మంజూరు చేయించారు. దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు బ్రాంచ్ కెనాల్‌పై కల్వర్టును పునర్నిర్మించేందుకు రూ.20 లక్షలు, రేవేంద్రపాడు వద్ద పశ్చిమ ప్రధాన కాల్వ హెడ్ స్లూయిస్ అప్ స్ట్రీమ్ రక్షణగోడల మరమ్మతులకు రూ.30.60 లక్షలు, దుగ్గిరాల వద్ద పశ్చిమ ప్రధాన కాల్వపై ఉన్న కొమ్మమూరు హెడ్ స్లూయిస్ వద్ద ఆప్రాన్ మరమ్మతులకు రూ.51.30 లక్షలు, రేవేంద్రపాడు వద్ద హెడ్ స్లూయిస్ రిటైనింగ్ వాల్ మరమ్మతులకు రూ.77.30లక్షలు, దుగ్గిరాల వద్ద కొమ్మమూరు కాల్వ కుడిగట్టు రిటైనింగ్ వాల్ మరమ్మతులకు రూ.51.60 లక్షలు, దుగ్గిరాల ఆలీనగర్ వద్ద కొమ్మమూరు కాల్వ రిటైనింగ్ వాల్ పునర్నిర్మాణానికి రూ.2.06 కోట్లు కేటాయించారు.


డెల్టా కాల్వ దుస్థితిని పరిశీలిస్తున్న మంత్రి లోకేశ్

- గుంటూరు ఛానల్ ప్రధానకాల్వ కట్టల బలోపేతానికి రూ.73.90 లక్షలు, ఆత్మకూరు వద్ద స్లూయిస్ మరమ్మతులకు రూ.23.05 లక్షలు, ఏపీఎస్పీ బెటాలియన్ ప్రహరి నుంచి బైపాస్ సర్వీసు రోడ్డు వరకు ఉన్న వాగు పూడికతీతకు రూ.41.20 లక్షలు, చిలువూరులోని పాత టీబీ డ్రెయిన్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.1.20 కోట్లు, దుగ్గిరాల మండలం దంతలూరు కోడు మీడియం డ్రెయిన్ రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రూ.36.62 లక్షలు కేటాయించారు.

మిర్చి యార్డులో ట్రేడ్ బంద్‌కు ప్రయత్నాలు

- కూలి పెంచాలని ముఠా నాయకుల ఒత్తిళ్లు
- రేపు సమావేశం ఏర్పాటు చేసిన జేసీ భార్గవతేజ

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చి ట్రేడ్ రెండేళ్ల నుంచి ఆర్థికంగా చితికిపోతుండగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొంతమంది ముఠా నాయకులు తాజాగా ట్రేడ్‌ని స్తంభింపచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ధర లేక కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసిన టిక్కీలను తాలుకాయులుగా కొందరు రైతులు అమ్ముకున్నారు. ఈ పరిస్థితుల్లో దిగుమతి కూలి పెంచాలంటూ కొందరు ముఠా నాయకులు కమీషన్ వ్యాపారులపై ఒత్తిడి తెస్తున్నారు. తమకు సహకరించకపోతే యార్డులో దిగుమతి కార్యకలాపాలు స్తంభింపచేస్తామంటున్నారు. యార్డులో చివరిసారిగా 2023 జూలై 21న కూలి రేట్లను పెంచారు. ప్రస్తుతం కాపల కూలి మిర్చి టిక్కీకి రూ.8.31 పైసలు, దిగుమతి కూలి రూ.8.20 పైసలు వసూలు చేస్తున్నారు. కాపలాకూలి బేసు రేటు రూ.6.10 పైసలు కాగా, దిగుమతి కూలి బేసు రేటు రూ.6.00గా ఉన్నది. ఈ బేసు రేటుపై 10 శాతం పెంచాల్సిందిగా కోరుతున్నారు. యార్డులో ఒక్కో టిక్కీకి రైతు గరిష్ఠంగా రూ.35 నుంచి రూ.40 వరకు వివిధ చార్జీల రూపంలో చెల్లించాల్సి వస్తుంది. వాస్తవానికి రూ.2 శాతం మాత్రమే కమీషన్ వసూలు చేసుకోవాల్సి ఉండగా రూ.5 వరకు కూడా వసూలు చేస్తున్నారు. ఇప్పుడు కూలి రేట్లు పెరగడం వల్ల ఆ ప్రభావం కచ్చితంగా ధరపై పడుతుంది. అది చివరాఖరుకు రైతుకే నష్టం కలిగిస్తుంది. ఈ క్రమంలో గురువారం యార్డులో జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ సమావేశం ఏర్పాటు చేశారు. అయినా బుధవారం ట్రేడ్ బంద్‌కు కొంతమంది ముఠా నాయకులు పిలుపునిచ్చారు.

పైపులైన్ల నిర్మాణంలో
లోపాలను గమనించాం
- మూడు రోజుల్లో సరిచేయాలని ఆదేశించాం
- ఏపీసీఆర్డీఏ కమిషనర్

పెదగార్లపాడులో మహిళ దారుణ హత్య
సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు
6

సబ్ జూనియర్స్‌లో సత్తాచాటిన వేటపాలెం ఎడ్లు

తురకపాలెంలో వైద్య శిబిరాల నిర్వహణ
- మట్టి, నీటి నమూనాల సేకరణ
8

నగదుకు బదులు కాస్మోటిక్ కిట్లు



- వసతి గృహ విద్యార్థులకు పంపిణీకి సన్నాహాలు
- చార్జీలు పెంచి ఆ మేరకు కిట్లలో నాణ్యమైన వస్తువులు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాస్మోటిక్స్ చార్జీలు సక్రమంగా అందక.. ఒకవేళ వచ్చినా కోతలతో వసతి గృహాల్లోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో కాస్మోటిక్స్ చార్జీలు పెంచడంతో పాటు నగదుకు బదులు విద్యార్థులకు నేరుగా వారికి అవసరమైన నాణ్యమైన వస్తువులతో కిట్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నగదు బదులు కాస్మోటిక్స్ వస్తువులను కిట్ల రూపంలో పంపిణీతో గోల్‌మాల్‌కు కూడా ఆస్కారం ఉండదని పలువురు భావిస్తున్నారు. దీనికితోడు తమకు అవసరమైన వస్తువులు ప్రభుత్వం కిట్ల రూపంలో పంపిణీ చేస్తుందని తెలిసి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, వసతిగృహాలు, ఆదర్శ పాఠశాలలు దాదాపు 100కిపైగా ఉండగా 12 వేలమందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాలు 23 ఉండగా 11 వేల మందికిపైగా విద్యార్థులు వసతి పొందుతున్నారు. వారందరికీ కాస్మోటిక్స్ కిట్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.


సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

కిట్లలో ఉండే వస్తువులు

సంక్షేమ హాస్టళ్ల, గురుకులాల విద్యార్థులకు కొబ్బరినూనె, టూత్‌పేస్టు, షాంపు, స్నానం, దుస్తులు ఉతుక్కునే సబ్బులు ఉంటాయి. విద్యార్థినులకు అదనంగా బొట్టు బిళ్లలు, పౌడర్, శానిటరీ నాప్కిన్ ఉంటాయి.

చార్జీల పెంపు ఇలా..

మూడో తరగతి నుంచి ఆరో తరగతి విద్యార్థులకు గతంలో నెలకు రూ.100 చెల్లిస్తుండగా దానిని రూ.125కు పెంచారు. విద్యార్థినులకు రూ.110 నుంచి 130కి పెంచారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.125 నుంచి రూ.150, విద్యార్థినులకు రూ160 నుంచి రూ.200 పెంచారు. కేజీబీవీల్లోని ఇంటర్ విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200 వరకు, విద్యార్థినులకు రూ.160 నుంచి 250 వరకు కాస్మో టిక్స్ చార్జీలు పెంచారు. బాలురకు హెయిర్ కటింగ్ చార్జీని రూ.30 నుంచి రూ.50కి పెంచారు. ఇలా పెంచే మొత్తాలకు కాస్మోటిక్స్ కిట్లు అంద జేయనున్నారు.

యువతకు మంచి భవిష్యత్తే పవన్ సంకల్పం

● మంత్రి మనోహర్ ● ఘనంగా జనసేన అధినేత జన్మదిన వేడుకలు



ఆస్పత్రిలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యువతకు అద్భుత భవిష్యత్తు అందించాలనేదే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పమని, ఆయన ఆశయ స్ఫూర్తిగా ప్రజల కోసం పని చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ సమాజానికి ఏదో చేయాలనే తపన పవన్ కల్యాణ్‌లో ఉందని, కూటమి ప్రభుత్వం ఏర్పాటులో ముఖ్యభూమిక పోషించారని చెప్పారు. అంత గొప్ప కమిట్‌మెంట్ ఉన్న నాయకుడు రాష్ట్రానికి అవసరమని, రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలను గతంలో ఉన్న పరిస్థితులకు భిన్నంగా పనితీరు బాగుందని, ఇతర జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం ఇక్కడకు రావడం మంచి పరిణామమన్నారు. 300లకు పైగా డెలివరీలు, మరో 300లకు పైగా ఇన్‌పేషెంట్స్, వెయ్యికి పైగా అవుట్ పేషెంట్లకు సేవలు అందిస్తున్నారని మరింత సమన్వయంతో వైద్యులు, సిబ్బంది పని చేసి ఆస్పత్రి ప్రతిష్ఠ పెంచాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆసుపత్రి వైద్యులు, జనసేన నాయకులు తోటకూర రమణరావు, జెట్టి గుణ, సాయి, రామకృష్ణ, పసుపులేటి మురళీకృష్ణ, రాంప్రసాద్, జాకీర్‌హుస్సేన్, కిరణ్‌కుమార్, రవికాంత్, హరికృష్ణ, గౌరీశంకర్ పాల్గొన్నారు.

'స్త్రీశక్తి' విజయోత్సవంపై ధన్యవాదాలు

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 1వ తేదీకి టీడీపీకి ఎంతో విశేషముందని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు మొదటిసారిగా 1995 సెప్టెంబరు 1వ తేదీన ప్రమాణ స్వీకారం చేసి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలు ఆయన వెన్నంటే ఉన్నారనేందుకు గడిచిన ఎన్నికల్లో వచ్చిన మెజార్టీనే నిదర్శనమన్నారు. 2013 సెప్టెంబరు 1వ తేదీన రాష్ట్ర విభజన సమయంలో విపత్కర పరిస్థితుల్లో గురజాల నియోజకవర్గం పొందుగల నుంచి ఆత్మగౌరవ యాత్ర నడపడంతో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన విషయాన్ని సీఎం చంద్రబాబు అనేక చోట్ల ప్రస్తావించడం జరిగిందన్నారు. సెప్టెంబరు 1వ తేదీన పిడుగురాళ్లలో నిర్వహించిన స్త్రీశక్తి విజయోత్సవ సభకు నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరిని ఎమ్మెల్యే యరపతినేని అభినందించారు. గురజాల నియోజకవర్గంలో కూడా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి ఇంటికి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇచ్చే కార్యక్రమం సంక్రాంతికి పిడుగురాళ్ల నుంచి ప్రారంభమై నియోజకవర్గమంతటా అందజేస్తామన్నారు.

పెదగార్లపాడులో మహిళ దారుణ హత్య



హత్య జరిగిన ప్రాంతానికి తరలివస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు

దాచేపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వితంతు మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం దాచేపల్లి మండలం పెదగార్లపాడులో జరిగింది. సంఘటనకు సంబంధించి దాచేపల్లి సీఐ భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దాచే పల్లి మండలం పెదగార్లపాడు గ్రామానికి చెందిన ముస్యం పోలేమ్మ(52) పెదగార్లపాడులో నివాసం ఉంటూ.. గత కొద్ది రోజులుగా గుంటూరులోని తమ కుమార్తె వద్ద ఉంటుంది. వితంతు పింఛ న్‌ను తీసుకొనేందుకు ఆగస్టు 31న పెదగార్లపాడు వచ్చింది. సెప్టెం బరు 1వ తేదీన పింఛన్ తీసుకుంది. మరుసటి రోజు గుంటూరు కుమార్తె వద్దకు వెళ్తానని బంధువులు, స్థానికులతో చెపింది. కానీ మంగళవారం ఆమె తలుపు తీయక పోవటం, గుంటూరు నుంచి కుమార్తె ఫోన్ చేస్తున్నప్పటికీ బదులు ఇవ్వక పోవటంతో స్థానికులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు వచ్చి పరిశీలించగా పోలెమ్మ రక్తపు మడుగులో పడి ఉంది. భయాందోళనతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాచేపల్లి సీఐ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎస్పీ కే శ్రీనివాసరావు, గురజాల డీఎస్పీ జగదీష్ గ్రామానికి చేరుకుని హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని సాక్షాధారాలను సేకరిస్తున్నారు. దాచేపల్లి ఎస్ఐలు పాపారావు, సౌదర్‌రాజన్‌లు సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు పోలెమ్మ హత్యకు గల కారణాలను, ఇతర ఆధారాలను పోలీసుల దర్యాప్తులో వెల్లడి కావాల్సి ఉంది.

రైతులకు అధిక లాభాలు వచ్చేలా సంగం నిర్ణయాలు : చైర్మన్ ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సంగం సీడ్ ప్రాజెక్ట్ ద్వారా షుగర్ లెస్ ధాన్యం విత్తనాలను, అభివృద్ధి చేసిన బీపీటీ విత్తనాలను రైతులకు అందించామని అలాగే టమాటో సీడ్ రైతులకు అందించేలా చర్యలు చేపట్టినట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తెలిపారు. సంగం డెయిరీ ప్రాంగణంలో మంగళవారం సంగం పాలకవర్గ సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ మినుము, పెసర, గడ్డి జాతి విత్తనాలను త్వరలోనే రైతులకు అందించేలా ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు. సంగం పాల ఉత్పత్తిదారులకు పాడి, పంట ద్వారా అధిక దిగుబడులు, అధిక లాభాలు వచ్చేలా సంగం పాలకవర్గ నిర్ణయాలు ఉంటాయని అన్నారు. అలాగే రైతులకు మేలైన పశుసంపదను అందించేలా సెక్స్‌డ్ సెమన్ ద్వారా జన్మించే మేలైన పడ్డ దూడలను హీపర్ ప్రాజెక్టు ద్వారా సేకరించి పెంచి తిరిగి రైతులకు అందించేలా ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు చెప్పారు. పన్నీర్ ప్లాంటును అధునాతన యంత్ర పరికరాలతో ఏర్పాటు చేయడానికి పాలకవర్గం ఆమోదించిందని చెప్పారు. పాల సేకరణ, ప్రాసెసింగ్ మార్కెటింగ్ అంశాలను దృష్టిలో ఉంచుకొని కొత్త ఉద్యోగుల నియామకం, నూతన ప్రాంతాలలో మార్కెట్ విస్తరణ, చిల్లింగ్ సెంటర్ల ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంగం డెయిరీ ఎండీ పి గోపాలకృష్ణ, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ అనిల్ కుమార్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మెటల్ క్వారీయింగ్‌పై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

యడ్లపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపాలెం గ్రామ పరిధిలో గల కొండలలో అనుమతుల్లేకుండా మెటల్ క్వారీయింగ్ చేస్తున్న విషయం ఉప్పరపాలెం గ్రామస్తులు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏళ్ళ తరబడి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా మెటల్ క్వారీయింగ్ చేస్తున్నారంటూ అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారు గుంజి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరేళ్లుగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా క్వారీయింగ్ జరుపుతున్నారన్నారు. రెండు నెలల క్రితం ఫిర్యాదు చేయగా కలెక్టర్ విచారణకు ఆదేశించగా ఆర్డీవో మధులత క్వారీయింగ్ నిలుపుదల చేయించి మైనింగ్, రెవెన్యూ సిబ్బందితో ఉమ్మడి సర్వే చేపట్టారు. అయితే సర్వేలో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ అర్ధాంతరంగా సర్వే నిలిపివేశారన్నారు. అయితే అధికారులు అనుమతి ఇవ్వకుండానే క్వారీ, క్రషర్ యజమానులు కూడబలుక్కుని 15 క్వారీలలో భారీగా బ్లాస్టింగ్‌లు చేస్తూ ప్రమాదకరంగా క్వారీయింగ్ నిర్వహిస్తున్నారన్నారు. గ్రామానికి ఆనుకుని ఉండడం వలన బ్లాస్టింగ్ ధాటికి బోర్లు కూలిపోతున్నాయని, ఇళ్ళు పగుళ్లు ఇస్తున్నాయని, వాతావరణం, నీరు కలుషితమవుతున్నదన్నారు. ఉప్పరపాలెం కొండలలో క్వారీయింగ్‌ను పూర్తిగా నిషేధించాలని కలెక్టర్‌ను కోరినట్లు శ్రీను వెల్లడించారు. అలాగే అనుమతుల్లేకుండా క్వారీయింగ్ చేస్తున్న వారి వివరాలను కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.



ఉప్పరపాలెం గ్రామ పరిధిలోని కొండ క్వారీలు

బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొని తండ్రీ కుమారుడు మృతి



ఆర్టీసీ బస్సు ఢీకొనగా రోడ్డుపై పడిన బైక్

ఫిరంగిపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనగా బైక్ పై ఉన్న తండ్రి కుమారుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని మేరికపూడి గ్రామం వద్ద జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకా రం రుసుం వెంకటేశ్వర్లు కుటుంబం నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన వారు. వీరు గత పది సంవత్సరాల క్రితం ఫిరంగిపురం మండలం మేరికపూడి గ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం సుమారు 10:30 గంటల సమయంలో గ్రామా నికి దగ్గరగా ఉన్న పెట్రోల్ బంకు వద్దకు బైక్ పై వచ్చిన తండ్రి రుసుం వెంకటేశ్వర్లు(55) అతని కుమారుడు భార్గవ్(23)లు పెట్రోల్ పోయించుకొని తిరిగి మేరికపూడి వెళ్తున్నారు. ఈ లోగా గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మేరికపూడి గ్రామ వద్ద డ్రైవర్ అజాగ్రత్తతో బస్సు బైక్ హ్యాండిల్‌కు తగలటంతో బైక్ అదుపు తప్పి రోడ్డు పై పడింది. బైక్‌పై ఉన్న తండ్రీ, కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు భార్గవ్ మృతి చెందగా, తండ్రి వెంకటేశ్వర్లును మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాలకు నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహిం చారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య పార్వతి, కుమార్తె దీపిక ఉన్నారు.

11న జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈ నెల 11వ తేదీన ఏర్పాటు చేస్తున్నట్టు సీఈఓ వీ జ్యోతి బసు వెల్లడించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా ఆధ్వర్యంలో కీలకమైన శాఖలకు చెందిన అంశాలపై ఆసక్తికరమైన చర్చ జరగనుంది

డెల్టా ఎక్స్‌ప్రెస్ ఇక 6.35కే సికింద్రాబాద్‌కు చేరిక

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ ప్రయాణించే నంబరు. 17626 రేపల్లె - వికారబాద్ డెల్టా ఎక్స్‌ప్రెస్ బుధవారం(ఈ నెల 4వ తేదీ) నుంచి ఉదయం 6.35కే సికింద్రాబాద్ చేరుకొంటుంది. ఈ మేరకు రైల్వే బోర్డు సమయపట్టికని సవరించింది. దీని వలన ప్రయాణికులు సికింద్రాబాద్‌కు త్వరితగతిన చేరుకొని గమ్యస్థానాలకు వెళ్లేందుకు సులభతరంగా ఉంటుంది. ఈ రైలు బేగంపేటకు ఉదయం 7.02, సనత్‌నగర్‌కు 7.11, హఫీజ్‌పేటకు 7.20, లింగంపల్లికి 7.30, నాగాలపల్లికి 7.40, శంకర్‌పల్లికి 7.50, గుల్లగూడకు 7.59, చిట్టిగడ్డకు 8.09, వికారబాద్‌కు 9.20కి చేరుకొంటుంది.

నిరుద్యోగ నిర్మూలనకు కృషి

● జాబ్‌మేళాలో 62 మంది ఎంపిక
● జిల్లా ఉపాధి కల్పనాధికారి రవీంద్రనాయక్



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి రవీంద్రనాయక్

క్రోసూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవీంద్ర నాయక్ అన్నారు. క్రోసూరు పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు ఆయన హాజరయ్యారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీ రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మొత్తం 183 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా 62 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ అభినంద నలు తెలియజేశారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బందితో పాటు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ అంజిరెడ్డి, రామకృష్ణారెడ్డి, వీరాంజనేయులు, హెచ్ఆర్ కంపెనీ ప్రతినిధి రమ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి పారుదల పనితీరు మదింపు కమిటీ

రాష్ట్ర జల వనరుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆదేశాల మేరకు నీటి పారుదల పనితీరు మదింపు కమిటీని నియమిస్తూ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రస్థాయిలో ఈటీ టూల్ కోర్ గ్రూప్‌ను జల వనరుల శాఖ ఏర్పాటు చేసింది. ఈ బృందంలో విజయవాడ సీడీవో చీఫ్ ఇంజనీరు, వ్యవసాయ శాఖ డైరెక్టరు, హైదరాబాద్ జీఐఎస్ డైరెక్టర్, ఎన్ఐహెచ్ కాకినాడ సెక్షన్ ఆఫీసర్ ఉంటారు. ఈ అధికారుల బృందం.. సీడబ్ల్యూసీకు, ప్రపంచ బ్యాంకుకు రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల తీరు, నాణ్యతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు వివరిస్తుంది.

కేరళ అర్బన్ కాన్‌క్లేవ్‌కు మేయర్లు

అమరావతి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కోచిలో ఈ నెల 12 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న కేరళ అర్బన్ కాన్‌క్లేవ్-2025కు హాజరయ్యేందుకు పలువురు మున్సిపల్ మేయర్లను, కమిషనర్లను ఎంపిక చేస్తూ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేరళ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ఈ కాన్‌క్లేవ్‌కు గ్రేటర్ విశాఖ మేయర్ పి.శ్రీనివాసరావు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోవెలమూడి రవీంద్రతోపాటు సీడీఎంఏ, విజయవాడ మున్సిపల్ కమిషనర్, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హిందూపూర్ మున్సిపాలిటీ కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌లు హాజరుకానున్నారు.

ఎలుకల మందు తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నం

● ప్రియుడి మృతి.. ప్రియురాలు పరిస్థితి విషమం

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాల మీదకు తెచ్చింది. వివాహిత ప్రియుడు మోజులో భర్త, పిల్లలను వదిలేసి గడప దాటింది. తిరిగి ఇంటికి వెళ్లలేక ఇరువురు కలిసి జీవించలేక చివరకు బలవన్మర ణానికి యత్నించారు. ఈ ఘటనలో ప్రియుడు వేల్పూరి రాకేష్ (30) మృతిచెందగా ప్రియురాలు సంతోషి ప్రాణాపాయ స్థితిలో జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ ఘటనకు సంబంధించి నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చీరాల పట్టణంలోని బోస్‌నగర్‌కు చెందిన వెల్పూరి రాకేష్, సాయి అనే ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇరువురికి వివాహాలు కాలేదు. తల్లిదండ్రులు వారి చిన్నతనంలోనే చనిపోయారు. అయితే రాకేష్ బేల్దారి పనులతో పాటు అప్పుడప్పుడు క్యాటరింగ్‌కు కూడా వెళ్తుంటాడు. ఈ క్రమంలో చీరాలలోని జాండ్రపేటలో గల చౌడేశ్వరి కల్యాణ మండపంలో సెక్యూ రిటీగా పనిచేస్తున్న నంగు సంతోషితో అతనికి పరిచయం ఏర్పడింది. అప్పటికే ఆమెకు వివాహమై భర్త, ఇరువురు పిల్లలు ఉన్నారు. రాకేష్, సంతోషిల మధ్య పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం సంతోషి భర్తకు తెలియడంతో ఆమెను మందలించాడు. దాంతో 20 రోజుల క్రితం ఇరువురు ఇంటి నుంచి వచ్చేశారు. గుంటూరులోని లాడ్జిలో ఉంటున్నారు. వారి వద్ద డబ్బులు అయి పోవడంతో నాలుగు రోజుల క్రితం ఇంటికి బయలుదేరారు. భర్త పిల్లలను వదిలి వచ్చేసిన నేపథ్యంలో సంతోషి తిరిగి ఇంటికి వెళ్లడానికి భయపడింది. అంతేగాక ఇరువురు విడిపోయి ఉండడానికి ఇష్టపడలేదు. ఈ క్రమంలో ఇరువురు కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నారు. గత నెల 30వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో ఏటుకూరు బైపాస్ రోడ్డు సమీపంలోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద శీతల పానీయంలో ఎలుకల మందు కలుపుకొని తాగారు. భయపడిన సంతోషి వెంటనే 108కు ఫోన్ చేయడంతో ఇరువురిని 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందగా సంతోషి ప్రాణాపాయస్థితిలో చికిత్స పొందుతోంది. సంతోషి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడు రాకేష్ తమ్ముడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవాతత్పరులు పవన్‌కల్యాణ్

● జన్మదిన వేడుకల్లో మంత్రి అనగాని



కేక్ కట్‌చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి)ః సినీరంగంలో రారాజుగా వెలిగి.. విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ తోటివారికి సహాయపడాలనే మంచి మనసుతో ముందుకు వెళుతున్న వ్యక్తి పవన్‌కల్యాణ్ అని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పాతపట్నంలోని అంకమ్మచెట్టు సమీపంలో జనసేనపార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టిమహేష్ ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 53వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేక్‌ను మంత్రి అనగాని సత్యప్రసాద్ కట్‌చేశారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ పేదప్రజలకు సేవచెయ్యాలనే ఉద్దేశ్యంతో ముందుకు వెళ్ళుతున్నారన్నారు. అధికారం చేపట్టిన 14నెలల్లోనే గ్రామాల్లో సుమారు 4,500 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేసిన ఘనత అయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడపాటి శ్రీనివాసరావు, దేవగిరి శంకర్, మెండు సుబ్బారావు, కొలసాని రాము, అల్లంశెట్టి నరేష్, చంటి, గాదె వెంకటగిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల అమలు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం చీఫ్ విప్ కార్యాలయంలో మెప్మా ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ సక్సెస్ కావడంలో కీలక పథకమైన "స్త్రీ శక్తి" ఉచిత బస్సు పథకం సూపర్ సక్సెస్ అయిందన్నారు. దీనిలో తమ వంతుగా సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలపడానికి నియోజకవర్గస్థాయిలో మహిళలతో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని మహిళలు సభను జయప్రదం చేయాలని కోరారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు పట్ల అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తుందని, మెప్మా, వెలుగు సిబ్బంది ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ పథకాలు అమలు తీసుకువెళ్లాలని కోరారు. నియోజవర్గంలోని ప్రతి మహిళ ప్రభుత్వానికి అండగా నిలబడి స్త్రీ శక్తి బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మెప్మా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల నిర్మాణంలో లోపాలను గమనించాం

● మూడు రోజుల్లో సరిచేయాలని ఆదేశించాం ● ఏపీసీఆర్డీఏ కమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నిబంధనల మేరకు రస్తు వేసి పైపులైను నిర్మాణం

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని 29 గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనుల్లో జరుగుతున్న లోపాలపై చర్యలు తీసుకున్నట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఒకటోతేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'పనికిరాని పనులు' వార్తా కథనంపై ఆయన స్పందించారు. రాజధానిలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి టెండర్ల ద్వారా పనులు చేపడతామని కమిషనర్ తెలిపారు. కాగా గతంలో మంజూరై ప్రస్తుతం అవసరం ఉన్న చోట తాగునీటి పైపలైన్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఆ పైపులైన్ల నిర్మాణంలో లోపాలను గుర్తించి వాటిని మూడు రోజుల్లో సరిచేయాలని సంబం ధిత కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు. అయితే వార్తా కథనం వచ్చిన వెం టనే పైపులైన పనులను ఆపేయాలని కాంట్రాక్టర్లను ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. దీంతో పైపులైన అనుసంధాన పనులు ఆగిపోయాయి. మూడు కిలోమీటర్ల దూరంలో కృష్ణానది ఉండగా తమకు అధికమొత్తంలో సున్నం, క్లోరిన్ ఉన్న నీటిని ఎందుకు సరఫరా చేస్తున్నారో చెప్పాలని స్థానిక ప్రజలు సీఆర్డీఏ అధికారులను ప్రశ్నిస్తున్నారు. భూగర్భ జలాలు కాకుండా కృష్ణా జలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

50,840 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,093 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,840 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,971 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	14200
నెంబరు. 5	10000	13400
273	10000	13600
341	10000	15300
4884	---	---
సూపర్ 10	---	---
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15400
షార్క్-1	----	----
బ్యాడిగి 355	10000	14600
దేవనూరు డీలక్స్	10000	13800
ఆర్మూరు	9800	12500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	14300
నెంబరు. 5	10000	13500
273	10500	13800
341	11000	15500
4884	10000	13500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15300
బ్యాడిగి 355	10000	14500
దేవనూర్ డీలక్స్	10500	13500
ఆర్మూరు	---	---
తాలుకాయలు	5000	7800

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో 150 కేడబ్ల్యూపీ సోలార్ పవర్ ప్లాంట్‌ని ప్రారంభిస్తున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

సౌర విద్యుత్ ద్వారా ఏటా రూ. 19.46 లక్షల ఖర్చు తగ్గింపు

● డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ద్వారా ఏటా రైల్ వికాస్ భవన్‌కు రూ. 19.46 లక్షల విద్యుత్ బిల్లు ఖర్చు తగ్గుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ అన్నారు. మంగళవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో ఆమె కొత్తగా 150 కేడబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సౌర విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంటుని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ ఈ ప్లాంటు వలన 60 శాతం విద్యుత్ బిల్లు ఆదా అవుతుందన్నారు. పెట్టిన పెట్టుబడి నాలుగున్నర సంవత్సరాల్లోనే రికవరీ అవుతుందన్నారు. అంతేకాకుండా ఈ సోలార్ ప్లాంట్ జీవితకాలం పాతికేళ్లుగా ఉంటుందన్నారు. ఈ ప్లాంటు వలన 298 టన్నుల కార్బన్ ఎమిషన్స్‌ని నిరోధించడం జరుగుతుందని, అవి 5 వేల చెట్లతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకు చెందిన వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

ఉన్నత విద్య ప్రైవేటీకరణతో యువతకు తీవ్ర నష్టం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సంస్కరణ తర్వాత ఉన్నత విద్యారంగంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని ప్రైవేటీకరణ వల్ల అనేక మంది యువత ఉన్నత విద్య దూరం అయ్యే పరిస్థితినెల కొందని మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు ఉన్నాయని వాటిల్లో రిక్రూట్‌మెంట్లు లేక ఉన్నత విద్యావ్యవస్థ పతనం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. అనే వర్శిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రస్తుతం నాలుగు వేల పైగా ఖాళీలు ఉన్నాయని, కొన్నిచోట్ల కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీ పద్ధతిలో అధ్యాపకులు పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 280 ఇంజినీరింగ్ కాలేజీలు, 200 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు 150, బి ఫార్మసీ కళాశాలలో 90% ప్రైవేట్ యాజమాన్యాలకు చెందినవేనని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్ ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి భావనారాయణ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, సహాయ కార్యదర్శి పవన్ కుమార్, యశ్వంత్ కమిటీ సభ్యులు సౌమ్య, అమృత, సింధుశ్రీ ,హర్షిత, సాహితి తదితర విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీరామ జననం హరికథాగానం

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం పద్మావతి కళ్యాణవేదికపై శ్రీ ఆదిభట్ల నారాయణదాస కథాకరణ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో శ్రీ నారాయణ దాస 161వ జయంతోత్సవాలలో భాగంగా మంగళవారం విజయలక్ష్మీ భాగవతారిణి, కొవ్వూరు వారిచే సీతాకళ్యాణంపై హరికథా గానం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటి, సంస్థ వారు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురాణం విజయలక్ష్మీ గానం చేస్తూ లోకంలో ధర్మాన్ని తిరిగి నెలకొల్పడం, దుష్ట శక్తులను అంతం చేయడం కోసం శ్రీరాముడు మానవ రూపంలో అవతరించాడన్నారు. కార్యక్రమం అనంతరం సంస్థ నిర్వాహకులు డాక్టర్ ఉపాధ్యాయుని రాజ్యలక్ష్మీ, కర్రా సూర్యనారాయణదాస్‌లు విజయలక్ష్మీను సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా లక్ష్మీ ప్రసన్న కుమారి

గుంటూరు(విద్య),సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా నికేతన్ ఓరియంటల్ హైస్కూల్లో హిందీ స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న పేర్నమిట్ట లక్ష్మీ ప్రసన్నకుమారి 2025 సంవత్సరానికి గాను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. బాపట్ల జిల్లా కావూరు జిల్లా పరిషత్ హై స్కూల్ లో పనిచేస్తున్న లక్ష్మీ ప్రసన్నకుమారి డిప్యూటేషన్ పై శారదా నికేతన్ లో పనిచేస్తున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పట్టాభిపురం లో సీనియర్ సభ్యురాలుగా ఉంటూ అనేక సమాజ హిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన లక్ష్మీప్రసన్న కుమారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వనజ ఉషాకుమారి, సహ ఉపాధ్యాయులు, జిల్లా లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ నూతలపాటి వీర ప్రకాష్‌రావు, క్లబ్ అధ్యక్ష అధ్యక్షులు రాధా, కార్యదర్శి సునీత, కోశాధికారి ప్రసన్నకుమారి, ఇతర సభ్యులు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

పుష్కలంగా యూరియా నిల్వలు

● అందుబాటులో 3788 మెట్రిక్ టన్నులు

● జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా లో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఖరీఫ్ లో 77340 హెక్టార్ల లో వివిధ రకాల పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 3788 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, 10వ తేదీ నాటికి మరో 1850 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందని అన్నారు. ఎరువుల కోసం ఎవరైనా ఇబ్బంది పెడితే రైతులు స్థానిక వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదర్శవంతమైన సుపరిపాలనకు 30 ఏళ్లు

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూ నాయక్

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నీతి, నిబద్ధత, కష్టపడే తత్వం, శాస్త్రీయ దృక్పథం, సుపరిపాలనను అందించిన గొప్ప దార్శనీయకత, విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు తొలిసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పీఠమెక్కి 30 ఏళ్లు గడవడం తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారూ నాయక్ అన్నారు. 1990లో దేశంలో వచ్చిన ఆర్థిక సంస్కరణలు నేపథ్యంలో వచ్చిన సానుకూల మార్పులను, క్షేత్రస్థాయిలో సామాన్యులకు చేరవేసేలా సుపరిపాలనను (గుడ్ గవర్నెన్స్) ప్రజల వద్ద పాలనగా, ప్రతి గడపకు తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి ఫలాలు కేవలం నేటి తరం మాత్రమే కాకుండా భావితరాల వారికి సైతం ఉన్నతమైన జీవన విధానాన్ని అందించేలా ఒక వ్యూహాత్మకంగా అభివృద్ధి, గుడ్ గవర్నెన్స్ ని అందించారన్నారు.

ఎన్నారై భర్త, ఆయన కుటుంబంపై వేధింపుల కేసు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నారై భర్త, ఆయన కుటుంబ సభ్యులపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వికాస్ నగర్ కు చెందిన కీర్తికి చిలకలూరిపేటకు చెందిన గద్దె బాల యశ్వంత్ కు ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఆరేళ్ల కుమార్తె సంతానం ఉంది. వివాహమైనప్పటి నుంచి వారి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. వారిరువురు పెళ్లయినప్పటి నుంచి లండన్‌లో ఉంటున్నారు. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు తీవ్రంగా అవడంతో కీర్తి ఇండియాకు వచ్చేసింది. పుట్టింటికి వచ్చిన కీర్తి పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు భర్త బాల యశ్వంత్‌తో పాటు అత్తమామలు, మరిది, తోడికోడలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిజాయితీకి నిలువెత్తు రూపం పవన్ కల్యాణ్

● ప్రశంసలు కురిపించిన కూటమి ఎమ్మెల్యేలు

● జనసేన కార్యాలయంలో జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో నీతికి, నిజాయితికి నిలువెత్తు రూపమైన జనసేనాని పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి తనదైన శైలిలో కృషి చేస్తున్నారని కూటమి నేతలు ప్రశంసించారు. మంగళవారం అమరావతి రోడ్‌లని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బూర్ల రామాంజనేయులుతో పాటు టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బర్త్‌డే కేక్‌ను వారు కట్ చేసి కార్యకర్తలకు అందజేశారు. డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ పని తీరును ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చందు సాంబశివరావు, తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ వేములపల్లి శివరామ ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, జనసేన కార్పొరేటర్‌లు యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మీదుర్గ, నాయకులు అయిశెట్టి కనకదుర్గ, సంకూరి శ్రీనివాసరావు, నిమ్మల వెంకట రమణ, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

మంచితనానికి చిరునామా పవన్ కల్యాణ్

● కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మానవత్వానికి, మంచితనానికి చిరునామా అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ కేక్ కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఒక అసాధారణమైన వ్యక్తి అని, అసామాన్యంగా ఎదిగిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, రాజామాస్టారు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో పవన్ కొత్త చరిత్ర

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేటుతో రాజకీయాల్లో కొత్త చరిత్ర సృష్టించిన పవన్ కల్యాణ్ సమీపకు సమీప భవిష్యత్తులో జాతీయ రాజకీయాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉందని మేకల రవీంద్రబాబు తెలిపారు. మంగళవారం జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో స్థానిక నిర్మల్ హృదయ్ అనాథాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యర్రంశెట్టి పద్మావతి, జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, మధులాల్, మొఖమాటం రమేష్‌బాబు, గిడుతూరి సత్యం, పత్తి భాస్కరరెడ్డి, మాధవరావు, శ్రీకర్‌సాయి, శిఖా బాలు, కందాబాబు తదితరులు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న రవీంద్రబాబు, రోశయ్య, గాదె

గుంటూరుకు ఇతర రాష్ట్రాల బృందాలు : కమిషనర్



ప్రసంగిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్ లో ఉత్తమ స్థానం సాధించడంతో గుజరాత్, ఇండోర్, చండీఘర్ ల నుండి అధ్యయన బృందాలు గుంటూరు నగరానికి రానున్నాయని కమిషనర్ తెలిపారు. మంగళవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో పట్టణ అధికారులతో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గుంటూరుకు దక్కిన కీర్తిని నిలబెట్టుకోవడంలో అందరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. గుంటూరు నగరంలో ఇంటింటి చెత్త సేకరణమ, హోం, క్లస్టర్, వర్మి కంపోస్టుల తయారీ, కొబ్బరిబొండాల ప్రోసెసింగ్ యూనిట్, వ్యర్థాల విభజన, తరలింపు వంటి అంశాలను అధ్యయనం చేయడానికి గుజరాత్ స్వచ్ఛ కార్పొరేషన్, చండీఘర్, ఇండోర్ ల నుండి అధికారుల బృందాలు గుంటూరు నగరానికి రానున్నాయన్నారు. కనుక పారిశుధ్య విభాగంలో మరింత నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ, స్థానిక కార్పొరేటర్ల మార్గదర్శకత్వంలో కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డీ శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టీ వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జ్ ఎస్ఈ సుందరరామి రెడ్డి, ఇంచార్జ్ ఎంహెచ్‌వో రామరావు, వివిధ డివిజన్ల కార్పొటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర్గత డ్రైయిన్లు శుభ్రంగా ఉంచాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో అంతర్గత డ్రెయిన్ల శుభ్రంపై ప్రజారోగ్య అధికారులు, కార్మికులు దృష్టి సారించాలని, వ్యర్థాలు అందులో వేసే వారి నుంచి, భారీగా అపరాధ రుసుం వసూలు చేయాలని కమిషనర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం కెవిపి కాలనీ, ఏటుకూరు రోడ్, పొన్నూరు రోడ్, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

సమస్యలను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలి

ప్రజల నుండి అందే అర్జీలు,సేవా దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, అలా చేయని వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, అధికారులు, సిబ్బందితో గ్రీవెన్స్,సేవా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఇంచార్జి ఎంహెచ్ఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాష విభాగాల అధికారులు, సూపరిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఈవో పద్మకు జ్ఞాపిక అందజేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఇంటర్ బోర్డు బోధనేతర ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ బోర్డులో పని చేసే బోధనేతర ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా చేబ్రోలు శ్యాంబాబు, ఉపాధ్యక్షుడిగా పీ.సాయి శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా బీ.గోపి కృష్ణ, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ రాజు, కోశాధికారిగా డీ.రామారావు, మహిళా కార్యదర్శిగా హిమబిందు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పీ.ప్రభు ద్యాని, కార్యవర్గ సభ్యులుగా ఏ.నారాయణ, కె.శ్రీనివాసరావు ఎన్నియ్యారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా నందివెలుగు రోడ్డులోని వినోబానగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, ఎల్‌బీ నగర్, క్రిస్టియన్‌పేట, కొండయ్యా కాలనీ, బీఆర్ స్టేడియం, అంకమ్మతల్లి ఆలయం, అలీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 6 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్ పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరంచాలని కోరారు.

ఆర్య సమాజం పూర్వ కార్యదర్శి మృతి

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్య సమాజం పూర్వ కార్యదర్శి కొత్తమాసు మల్లికార్జునరావు మంగళవారం కంకరగుంట స్కైలైన్ అపార్ట్‌మెంట్స్‌లోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. భార్య మంజువాణి, కుమార్తె కళ్యాణి అనుమతితో ప్రజా ఆలోచన వేదిక సహకారంతో ఆయన నేత్రాలను శంకర నేత్ర ఆసుపత్రికి దానం చేశారు. ఆర్యసమాజం జిల్లా అధ్యక్షురాలు గుర్రం నిర్మల దేవి మాట్లాడుతూ పండిత గోపదేవశాస్త్రి ప్రియ శిష్యునిగా మల్లికార్జునరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్, కన్వీనర్ వల్లూరి సదాశివరావు, గోపదేవ్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పలువురు ప్రముఖులు హాజరై మల్లికార్జునరావు భౌతిక కాయానికి నివాళులర్పించారు.




భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఆర్య సమాజం ప్రతినిధులు, అంతర చిత్రంలో మల్లికార్జునరావు (ఫైల్)

ధన గణపతి

● రత్నగిరి కాలనీలో రూ. 2 కోట్లతో అలంకరణ

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పలకలూరు రోడ్డులోని రత్నగిరి కాలనీలో 31వ గణేష్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రత్నగిరి నగర్ ఫ్రెండ్ సర్కిల్ యూత్ వారి ఆధ్వర్యంలో రూ.2 కోట్లతో గణనాధుడిని అలంకరించారు. రూ.500లు, రూ.200, రూ.100, రూ.50ల నోట్లు మొత్తం రూ.2 కోట్ల కరెన్సీతో గణనాధుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దాంతో పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కరెన్సీ గణపతిని దర్శించుకున్నారు.



రూ 2 కోట్ల అలంకరణలో కరెన్సీ గణపతి

వన గణపతి

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఎదుట వాసవి యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుచున్నవి. ఇందులో భాగంగా మంగళవారం గణనాధునికి ప్రత్యేక పూజలు జరిపి వివిధ రకాల మొక్కలతో అలంకరించారు. ఈ సందర్భంగా వన గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యామ్ సుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నా రామ్ ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.



మొక్కలతో వన గణపతిగా దర్శనమిచ్చిన గణనాధుడు

జన ఔషధి షాపులను బీసీలకు కేటాయించాలి : కేసన

మంగళగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదలపై వైద్య భారం తగ్గించేలా నాణ్యమైన మందులను తక్కువ ధరకు అందించేందుకు జన ఔషధి షాపులను ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని, ఆ షాపుల్లో సగభాగం బీసీ నిరుద్యోగ యువతకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. బీసీ యువతకు జన ఔషధి దుకాణాల ఏర్పాటు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయండి

● మంత్రి గొట్టిపాటికి ఎమ్మెల్యే మాధవి వినతి

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా మూడు 33/11కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవిని కోరారు. సచివాలయంలో మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలసిన ఎమ్మెల్యే సబ్‌స్టేషన్ల ఏర్పాటు కోసం వినతిపత్రం అందజేశారు. ఏటీ అగ్రహారం, జెడ్పీ కాంపౌండ్, సంపత్‌నగర్ సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని కోరగా, వెంటనే మంత్రి గొట్టిపాటి రవి సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. రెండు సబ్‌స్టేషన్ పనులు వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే మాధవి కోరగా, మంత్రి గొట్టిపాటి రవి సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

వినాయక మండపంలో ప్రత్యేక పూజలు

నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమరావతి రోడ్, గౌతమి నగర్ మూడో లైన్, విద్యానగర్ ఒకటో లైన్, కొండయ్య కాలనీ మండపాలలో భక్తులతో కలిసి పూజలు చేశారు.



గణేశుడికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

స్మార్ట్ రైస్ కార్డులు దేశంలోనే ప్రథమం

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) ప్రజలకు సేవలను అత్యంత వేగంగా అందించడంతో సీఎం చంద్రబాబు నాయుడు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని వెంగళరావు నగర్, 12వ డివిజన్ అహ్మద్ నగర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్నాలజీ అందిపుచ్చుకుని రాష్ట్ర ప్రజలకు అందించడంలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రథమస్థానంలో ఉంటారని ఆయన తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ఆలోచన ద్వారా రాష్ట్రంలో కోట్ల మంది ప్రజలకు సులభరీతిలో సేవలు అందనున్నాయని చెప్పారు. కార్యక్రమంలో చిట్టాబత్తిని చిట్టిబాబు, గోళ్ళ ప్రభాకర్, గుడిమెట్ల దయారత్నం పాల్గొన్నారు.



స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

మత్తుపదార్థాలతో అనర్థాలు అనేకం

గుంటూరు(విద్య),సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలు వినియోగం వల్ల అనేక నష్టాలు ఉంటాయని విద్యార్థులు వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఎస్సై డీ రమేష్ హెచ్చరించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలకు యువత ఎక్కువ గా బానిసలు గా మారతున్నారని వీటికి అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా,శారీరకంగా కుంగిపోతారని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం జోనల్ కో ఆర్డినేటర్ యస్. జాకబ్ రాజు, ప్రిన్సిపల్ యస్ కె. ముంతాజ్, నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినటర్ బి. రమేష్, యమ్. కవిత తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోరాటాలతో హక్కులను సాధించుకోగలుగుతామని ఆశా వర్కర్ల యూనియన్ నగర అధ్యక్షుడు కే శ్రీనివాసరావు అన్నారు. ఆశా వర్కర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సంగడిగుంట, రెడ్ల బజారులో అర్బన్ హెల్త్ సెంటర్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారా ఆశాలకు రూ.10 వేల వేతనం లభిస్తుందని తెలిపారు. ఈనెల 4న పాత గుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో జరిగే ఆశా వర్కర్స్ యూనియన్ నగర మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్ఆర్‌కు ఘన నివాళులు

గుంటూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా వైసీపీ, కాంగ్రెస్ నాయకులు నగరంలో పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ భవన్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, పార్టీ నాయకులు జాన్‌బాబు, గద్దం పాల్‌విజయ్‌కుమార్, బిళ్ళా సునీల్, బ్రహ్మం, జబీవుల్లా తదితరులున్నారు. అనంతరం చిలకా విజయ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆశయాలను నెరవేర్చే నిజమైన వారసురాలు షర్మిలారెడ్డి మాత్రమేనన్నారు. వైఎస్ జగన్ తీరును చూసి నేడు వైఎస్ఆర్ ఆత్మక్షోభిస్తుందన్నారు. వైఎస్ఆర్ ఫోటోను చూపి దళితులను, ముస్లింమైనార్టీలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఎల్లకాలం ప్రజల్ని జగన్ మోసం చేయలేరన్నారు.



సంగడిగుంటలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబటి, ఏసురత్నం, నూరిఫాతిమా తదితరులు

● వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా సంగడిగుంట లాంచెష్టర్ రోడ్డులో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, తూర్పు ఇన్‌ఛార్జ్ నూరిఫాతిమా, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంలు హాజరై వైఎస్ఆర్ విగ్రహానికి గజమాలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైసీపీ నాయకులు తదితరులున్నారు. వైఎస్ఆర్ పాలనలో సంక్షేమ పథకాలతో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు.

● బృందావన్‌గార్డెన్స్‌లోని వైసీపీ కార్యాలయంలో దివంగత సీఎం వైఎస్ఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తూర్పు ఇన్‌ఛార్జ్ నూరిఫాతిమాలు వైఎస్ఆర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉన్నారు.

● నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్‌లో బాలిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి లాంఛనంగా ప్రారంభించారు.



రైళ్లల్లో... సీసీ కెమేరాల నిఘా

● ఏర్పాటుకు సన్నాహాలు ● చోరీలకు చెక్ పెట్టే దిశగా చర్యలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రయాణం అంటే ఇటీవల ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. దుండగులు రైల్లో ప్రయాణిస్తూ ఏదో ఒక సిగ్నల్ వద్ద ఆపిన వెంటనే చోరీ చేసి ఉడాయిస్తున్నారు. కిటికీల పక్కన ఉంటే ప్రయాణీకుల మెడలోని బంగారు ఆభరణాలను లాగేస్తున్నారు. ఇటీవల పిడుగురాళ్ల, పొందుగుల వద్ద రైళ్లను సిగ్నల్ వద్ద ఆపి వేసి ప్రయాణీకుల మెడలోని బంగారు ఆభరణాలను దొంగలు అపహరించుకు వెళ్ళిన సంఘటనలు జరిగాయి. రైల్వే ప్రొడక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు గస్తీ తిరుగుతున్నా చోరీలకు అడ్డుకట్ట పడలేదు. వీటిని దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్ట మైన భద్రతా ఏర్పాట్లకు రైల్వే ఉన్నతాధికారులు సన్నద్ధమవుతున్నారు. రైల్వే శాఖ ప్రతి భోగీలో సీసీ కెమేరాల ఏర్పాటుకు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు.

సీసీ కెమేరాల ఏర్పాటుకు సన్నాహాలు

రైళ్లల్లో చోరీలకు చెక్ పెట్టే దిశగా రైల్వే శాఖ భోగీల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయనుంది. వాటిని పర్యవేక్షించేందుకు రైలులో ఒక భోగీలో సాంకేతిక నిపుణులు ఉంటారు. అనుమానం వచ్చినప్పుడు తనిఖీలు చేస్తుంటారు. భోగీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే పోలీసు సిబ్బందికి సమాచారం చేరవేస్తారు. వారు ఆ భోగీలోకి వెళ్ళి అనుమానితులను విచారించే అవకాశం ఉంటుంది. మరి కొంత మంది గంజాయి, ఇతర ప్రమాదకర వస్తువులను భోగీలో ఉంచి మరొక భోగీలో ప్రయాణిస్తుం టారు. గంజాయిని పోలీసులు పట్టుకున్నా అసలైన దుండ గులు తప్పించుకుంటున్నారు. ఇలాంటి వాటికి కూడా సీసీ కెమేరాలతో చెక్ పెట్టవచ్చు. ప్రతి భోగీలో సీసీ కెమేరాలు ఏ ర్పాటు చేస్తే దొంగలను పట్టుకొనే వీలుంటుంది. చోరీలు కూడా తగ్గుముఖం పడతాయి. రైళ్లలో ఇప్పటికే బీట్లు పెంచారు.

బోర్డులకే పరిమితమైన.. యువ క్లినిక్స్

◆ పలు రకాల సేవలకు దూరం



వేమూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో కౌమర దశలో ఉన్న వారు (10-19 సంవత్సరాలు) మొత్తం దేశ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటారని సర్వేలు తెలుపుతున్నాయి. వీరిని దృష్టిలో పెట్టుకుని భారత దేశ ప్రభుత్వం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రధానంగా కౌమార దశలో ఉన్న వారి ఆరోగ్యం కోరుకునే ప్రవర్తనను ప్రభావితం చేసేందుకు యువ క్లినిక్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్లినిక్స్ ద్వారా కౌమర దశలోని యువతీ యువకులకు అనేక రకాల సేవలు అందించేందుకు గాను పీహెచ్‌సీల పరిధిలోని, డాక్టర్‌తో పాటు కొందరు ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అయితే ఈ కేంద్రాలలో సంబంధించిన బోర్డులు కనపడతాయి కానీ వాటి సేవలు మాత్రం యువతీ యువకులకు చేరువ కావడం లేదు. కొన్ని కేంద్రాలలో బోర్డులు కూడా లేని పరిస్థితి ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు తిలోదకాలు ఇవ్వడం అయ్యింది. ప్రధానంగా కౌమర ప్రత్యుత్పత్తి లైంగిక ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి వారానికి ఒకరోజు సంబంధించిన సేవలను అందించాల్సి ఉంది. శిక్షణ పొందిన సిబ్బంది ద్వారా కమ్యూనికేషన్ ప్రవర్తన మార్పు కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుతో పాటు రూబెల్లా నివారణకు రూబెల్లా వ్యాక్సిన్ కౌమార దశలోని బాలికలకు ఇవ్వాల్సి ఉంది. ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక సదస్సులు ఏర్పాటు చేయాలి కానీ ఈ ప్రక్రియలు ఏ మాత్రం కొనసాగడం లేదు. ఈ సేవల ద్వారా ప్రధానంగా బాల బాలికల శారీరక పెరుదల సమస్యలపై కౌన్సెలింగ్ సేవలు నెలసరి శుభ్రతపై అవగాహన కల్పించాల్సి ఉంది. పోషక ఆర్థిక ఆవశ్యకత మీద అవగాహన సేవలు అందించడంతో పాటు గర్భనిరోధక పద్ధతుల ద్వారా అవగాహన జీవన నైపుణ్యాల మీద అవగాహన కల్పిస్తూ ధూమపానం, మద్యపానం మానడానికి సలహాలు ఇవ్వడం, ఉన్నత స్థాయి ఆసుపత్రులలో అందించే చికిత్సలు అవసరమైనటు వంటి కౌమారులకు రిఫెరల్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. వీటిలో ఏ ఒక్క సేవ కూడా లేకపోవడం దీని అమలుపై ఉన్నతాధికారులు కూడా దృష్టి పెట్టకపోవడం వల్ల యువతీ యువకులకు ఈ సేవలు అసలు అందడం లేదు. ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో యువ క్లినిక్ బోర్డులు మాత్రం కనబడుతున్నాయి. వాటి సేవలు మాత్రం కొనసాగడం లేదు. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి కేవలం బోర్డులకే పరిమితం కాకుండా సంబంధించిన సేవలను దరికి చేర్చే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన యువ క్లినిక్ బోర్డు


పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటు భూమిపూజ స్థలంలో జర్మన్ వాటర్ ప్రూఫ్ టెంటు

నేడు రాజధానిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి భూమిపూజ

హాజరుకానున్న మంత్రి లోకేశ్

తుళ్లూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని రాజధాని అమరావతిలోఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి తుళ్లూరు పెదపరిమి మధ్యలో బొమ్మల రోడ్డు వద్ద 6.8 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు మంత్రి నారా లోకేశ్ పొట్టి శ్రీరాములు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయనున్నారు. భవిష్యత్‌తరాలకు స్ఫూర్తిదాయకంగా పొట్టి శ్రీరాములు మొమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 58 అడుగుల విగ్రహంతో పాటు మ్యూజియం, ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణం చేయ నున్నారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని విగ్రహ ప్రారంభోత్సం చేసేలా పనులు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

తురకపాలెంలో వైద్య శిబిరాల నిర్వహణ

● మట్టి, నీటి నమూనాల సేకరణ

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో ప్రబలిన జ్వరాలను కట్టడి చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ప్రమాదకరమైన గ్రామంలో ఉచిత వైద్య శిబిరంతో పాటు ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. 15 రోజుల పాటు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు ఈ వైద్య శిబిరాలు జరుగుతాయి. జ్వరం, ఆయాసం, దగ్గు ఉన్న వారు ఈ శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు కోరారు. ఈ వైద్య శిబిరాల్లో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, సైకియాట్రిస్టులు గ్రామస్తులకు వైద్యపరీ క్షలు నిర్వహిస్తారు. గ్రామంలో మొత్తం 2200 మందికి వైద్యపరీక్షలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పదుల సంఖ్యలో మరణాల వల్ల గ్రామస్తుల్లో భ యాందోళనల నేపథ్యంలో సైకియాట్రిస్టులను కూడా రంగంలోకి దించి వారికి కౌన్సెలింగ్ సేవలు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. తురకపాలెంలో మెలియోయిడోసిస్ జ్వరాలు ప్రబలినట్లు అనుమానం వ్యక్తమవుతున్న నేపథ్యంలో జ్వర బాధితుల నుంచి బ్లడ్ కల్చర్ పరీక్షలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మైక్రోబయాలజీ వైద్యనిపుణులు ఈ శిబిరాల్లో రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఈ జ్వరాలకు కారణమయ్యే బర్కల్డేరియా సూడోమల్లీ మట్టిలో, నీటిలోనూ ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని సాయిల్ టెస్ట్, వాటర్ శాంప్లింగ్ టెస్టులు చేపట్టారు. వీటిని గుంటూరు వైద్య కళాశాల ల్యాబ్‌లో పరీక్షిస్తారు.


తురకపాలెంలో రోగుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యబృందం

సబ్ జూనియర్స్‌లో సత్తాచాటిన వేటపాలెం ఎడ్లు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు మెమోరియల్ ఎడ్ల బండలాగుడు పోటీలు ప్రత్తిపాడులో రసవత్తరంగా సాగుతున్నాయి. గత నాలుగు రోజులుగా ప్రత్తిపాడులో వివిధ విభాగాలలో ఈ ఎడ్ల బండలాగుడు పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక ఎడ్ల జతలు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. మంగళవారం జరిగిన సబ్ జూనియర్స్ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 3836.8 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తెలంగాణా రాష్ట్రం రంగారెడ్డికి చెందిన డీ రోహన్‌బాబు ఎడ్లు 3635 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లు 3600 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. విజేతలకు తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చేతుల మీదగా నగదు బహుమతి అందజేశారు. అనంతరం సీనియర్స్ విభాగం పోటీలను తెనాలి శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్నె శ్రీనివాసరావు, గింజుపల్లి వెంకటేశ్వరరావు, వెలివెల్లి సుబ్బారావు, పమిడి అంజియ్య చౌదరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


విజేతకు రూ.45 వేలు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యేలు శ్రావణ్ కుమార్, రామాంజనేయులు, చిత్రంలో వడ్రాణం హరిబాబు

ఇక పక్కాగా.. రేషన్ లెక్క

ప్రత్యేక యాప్‌తో అవకతవకలకు చెక్

సత్తెనపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువుల లెక్కలు ఇక పక్కాగా ఉండనున్నాయి. ప్రత్యేక యాప్‌తో అవకతవకలకు చెక్ పడనుంది. పౌర సరఫరాల శాఖ రేషన్ షాపుల ప్రక్షాళన దిశగా పలు చర్యలు తీసుకుంటోంది. ఎఫ్‌పీఎస్ ఇన్‌స్పెక్షన్ పేరిట ప్రత్యే క యాప్‌ను ఇటీవల ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. సరుకుల పంపిణీలోని అక్రమాలను నిరోధించేందుకు ఈ యాప్ పని చేస్తుంది. పౌర సరఫరాల శాఖలోని అధికారులు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్‌వో, డీఎస్‌వో, ఆర్డీవో, జేసీ నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకు ఈ యాప్ సాయంతో రేషన్ దుకాణాల్లోని సరుకులను ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చు. ఈ నెల 15వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీ జరుగుతుంది. 15 నుంచి 25వ తేదీ వరకు పంపిణీ ఉండదు. తిరిగి 25వ తేదీ నుంచి ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ జరుగుతుంది. నెల లో ఏ రోజైన రేషన్ షాపుల్లో తనిఖీ చేసే అధికారం అధికారులకు ప్రభుత్వం కల్పిం చింది. 15 నుంచి 20వ తేదీల మధ్య పంపిణీ చేయకున్నా.. దుకాణాల్లో నిల్వ, కార్డుదా రుల వివరాలను తనిఖీ చేయవచ్చు. మ్యాన్యువల్ విధానంలో తప్పుల సర్దుబాటుకు ఇన్నాళ్లు ఆస్కారం ఉండేది. ప్రస్తుతం అధికారులు చౌక దుకాణాలకు వెళ్లిన వెంట నే అక్కడ వివరాలను.. యాప్‌లో ఉన్న ఆన్‌లైన్ వివరాలతో సరి పోలుస్తున్నారు. తేడాలుంటే అక్కడికక్కడే చర్యలు తీసుకుంటున్నారు. తనిఖీల సమయంలో కార్డుదారులతో మాట్లాడి, అభిప్రాయాలను కూడా యాప్‌లో నమోదు చేస్తున్నారు. సరుకుల పంపిణీలో తూకం సక్రమంగా ఉందా.. లేదా వివరాలను తెలుసుకుంటారు.

స్త్రీశక్తి కిటకిట

● ఆర్టీసీలో పెరుగుతున్న మహిళా ప్రయాణికులు
● గతంలో రోజుకు లక్షా 20వేలు ఉంటే ప్రస్తుతం లక్షా 40వేలకు పెరిగిన వైనం

గుంటూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రోజువారీ లెక్కన చూస్తే మహిళా ప్రయాణికుల సంఖ్య దాదాపు 20 శాతంపైగా పెరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో గుంటూరు జిల్లా పరిధిలో రోజువారీ లక్షా 20 వేల మంది మహిళా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో వివిధ ప్రాంతాలకు గమ్యస్థానాలకు చేరుతుంటే ప్రస్తుతం ఆ సంఖ్య కాస్త లక్షా 40వేలకు చేరినట్లు గుంటూరు జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో) సీహెచ్ విమల తెలిపారు. విభజిత గుంటూరు జిల్లా పరిధిలో గుంటూరు-1, 2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోలున్నాయి. ఆయా


ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికుల కోలాహలం

డిపోల పరిధిలో రోజువారీగా మహిళా ప్రయాణికుల సంఖ్య గతంలో లక్షా 20వేల మంది వరకు మహిళలు తమ తమ గమ్యస్థానాలకు చేరేవారు. అది కాస్త స్త్రీ శక్తి పథకం అమల్లోకి రావటంతో మహిళా ప్రయాణికుల తాకిడి ఎక్కువగా పెరిగిందని చెబుతున్నారు. ఇక పల్లెవెలుగు బస్సుల్లో సాధారణ టిక్కెట్ల కంటే జీరో ధర టిక్కెట్లే అత్యధికంగా ఉంటున్నాయి. ఇక బాపట్ల జిల్లా పరిధిలోకి బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి డిపోల పరిధిలో కూడా మహిళా ప్రయాణికుల రద్దీ రోజువారీగా పెరుగుతోంది. వాస్తవానికి బాపట్ల పరిధిలో అత్యధికంగా పల్లె వెలుగు సర్వీసులున్నాయి. దాంతో మహిళా ప్రయాణికుల సంఖ్య కూడా అత్యధికంగా నమోదవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలానే నరసరావుపేట కేంద్రంగా ఉన్న పల్నాడు జిల్లా పరిధిలో నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ డిపోల పరిధిలో కూడా రోజువారీ మహిళా ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగినట్లు అధికారులు గణాంకాలతో విశ్లేషిస్తున్నారు. ఇక ఆదివారం, పండుగల వంటి శెలవు దినాల్లో మహిళల రద్దీ మరింత అధికంగా ఉంటోందని చెబుతున్నారు.

రద్దీకి అనుగుణంగా ట్రిప్పులు పెంచుతున్నాం: డీపీటీవో విమల

మహిళా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. స్త్రీ శక్తి పథకం అమల్లో ఎక్కడా ఎటువంటి సమస్యల్లేవు. పొన్నూరు ప్రాంతంలో ట్రిప్పులు పెంచాలని విజ్ఞప్తులు వచ్చాయి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ఇక రాజధాని ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాలకు ఇబ్బందుల్లేకుండా సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి.

యుగంధర్ కళాకృతులు అద్భుతం

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చివరి సంవత్సరం విద్యార్థి కే యుగంధర్ రూపొందించిన కళాకృతులు అద్భుతంగా ఉన్నాయని ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కే గంగాధరరావు అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయం ఆవరణలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గ్యాలరీలో కళాకృతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్, డిజైన్ వంటి రంగాలకు సాంస్కృతిక వారసత్వానికి చిత్రకళే మూలమని పేర్కొన్నారు. యుగంధర్ చేసిన కళాకృతులు వీటికి దర్పణం పడుతున్నాయని అన్నారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య రత్న షీలామణి మాట్లాడుతూ యుగంధర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఇతర విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించాలన్నారు. ఈ ఎగ్జిబిషన్లో యుగంధర్ వివిధ మాధ్యమాలతో చేసిన 32 కళాకృతులను, శిల్పాలను ప్రొగ్రెస్ ఆఫ్ థాట్స్ పేరుతో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం సురేష్ కుమార్, డిపార్ట్మెంట్ అధ్యాపకులు పీ దేవకాంత్, పీ శ్రీనివాసరావు, బీ శేఖర్ బాబు, బీ జాన్ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.


ఏఎన్‌యూ విద్యార్థి యుగంధర్ రూపొందించిన కళాకృతులను తిలకిస్తున్న ఉపకులపతి గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్న షీలామణి తదితరులు

నిర్ణయాలపై.. నీలినీడలు

(5వ పేజీ తరువాయి)

రూ.కోట్లు కుమ్మరించి కొత్తవి కొనుగోలు చేశారు. ప్రొసీడింగ్ 316 ప్రకారం 2025 జనవరి 9న జరిగిన బడ్జెట్ సమావేశంలో వీసీతో పాటు భౌతికంగా ఇద్దరు, మరో ఇద్దరు అధికారులు జూమ్‌లో హాజరయ్యారు. తీర్మానం 10505 ప్రకారం సిబ్బంది ఉద్యోగోన్నతలకు సంబంధించి 2025 మే 12న జరిగిన సమావేశంలో ఇద్దరు భౌతికంగా, ముగ్గురు సభ్యులు జూమ్‌లో హాజరయ్యారు. ఇలా ప్రతి సమావేశం కోరం లేకుండానే జరగ్గా రిజిస్ట్రార్ పేరును కూడా మెంబర్‌గా చూపించి తీర్మానాలు రికార్డు చేశారు.

అన్నీ రద్దయ్యేవే..

విశ్వవిద్యాలయ చట్టం ప్రకారం బోర్డు ఏర్పాటు చేసే అత్యవసర, సాధారణ సమావేశాలకు అధ్యక్షుడి సహా ఆరుగురు సభ్యులు ఉండాలి. 2024-2025 మధ్య సుమారు 100 మందికి సీనియర్ సైంటిస్టులుగా, అసోసియేట్ సైంటిస్టులుగా ఉద్యోగోన్నతులు ఇచ్చారు. కొంతమంది సాంకేతిక సిబ్బంది సర్వీస్ ను క్రమబద్ధీకరించి జీతాలు పెంచారు. ఈ నిర్ణయాలన్నీ సక్రమం కాదన్న ప్రచారంతో గొడవ మొదలైంది.

వీడని వరద

(5వ పేజీ తరువాయి)

స్థాయికి కూడా చేరింది. లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు కూడా అధికారులు తరలిస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వరద పోటె త్తుతోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 3,03,644 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం నిండు కుండలా మారింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం వరకు 26 గేట్లు ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు ఆ తర్వాత 18 క్రస్ట్‌గేట్లకు పరిమితం చేశారు. మంగళవారం సాయంత్రానికి సాగర్‌కు ఇన్‌ఫ్లో 1,89,344 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 1,89,344 క్యూసెక్కులు ఉంది. ఇంకొన్ని రోజులు సాగర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. జలాశయంలో పూర్తి స్థాయి సామర్థ్యం 312.04 టీఎంసీలకు 299.74 టీఎంసీలు నిల్వ ఉంది. సాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా 2,25,106, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 33,130, కుడి, ఎడమకాల్వకు కలిపి మొత్తంగా 2,75,492 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

- సత్రశాల టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతుండడంతో 8 రేడియల్ క్రస్ట్ గేట్లను 3.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 1,43,704 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. వరద ప్రవాహం తగ్గడంతో మంగళవారం రాత్రి నుంచి రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించామన్నారు.
- పులిచింతలలో మంగళవారం 37.45 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,36,450 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 1,46,319 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

29 రోజులు నీటి విడుదల

జూలై 29 నుంచి మంగళవారం వరకు చూస్తే సాగర్ జలాశయం నుంచి 29 రోజులు నీటిని విడుదల చేశారు. జూలై 29న నీటి విడుదల ప్రారంభించగా ఆగస్టు 2 వరకు కొనసాగింది. ఆ తర్వాత 8 రోజులు గేట్లను బంద్ చేశారు. మళ్లీ ఆగస్టు 11 నుంచి ప్రారంభమైన నీటి విడుదల కొనసాగుతోంది. ఇప్పటి వరకు విద్యుత్ ఉత్పత్తి ద్వారా 11,35,133 క్యూసెక్కులు(98.70 టీఎంసీలు) నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 57,26,739 క్యూసెక్కులు(497.97 టీఎంసీలు) నీటిని విడుదల చేశారు. కుడి కాల్వకు 3,04,000 క్యూసెక్కులు(26.43 టీఎంసీలు) నీటిని ఇప్పటి వరకు విడుదల చేశారు. గత నెల 20న రికార్డు స్థాయిలో 4.61 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ప్రకాశం బ్యారేజి నుంచి 3.37 లక్షల క్యూసెక్కులు

తాడేపల్లిటౌన్ : పులిచింతల ప్రాజెక్టుతో పాటు ప్రకాశం బ్యారేజి ఎగువన ఉన్న కీసర, మున్నేరు, వెలగలేరు వాగుల నుంచి మంగళవారం 3 లక్షల 52 వేల 772 క్యూసెక్కుల వరదనీరు ఇన్‌ఫ్లోగా నమోదైనట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 3 లక్షల 37 వేల 525 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వకు 8 వేల 417 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6 వేల 830 క్యూసెక్కులు వదులుతున్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు జమ

తుళ్లూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మరణించిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ నగదు బ్యాంకులో జమయినట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు మంగళవారం విలేకరులకు తెలిపారు. తుళ్లూరు వడ్డెర కాలనీకి చెందిన మల్లా ఏడుకొండలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడికి టీడీపీ సభ్యత్వం ఉండటంతో ప్రమాద బీమా అమలు జరిగిందిని అప్పారావు చెప్పారు. రూ.5 లక్షలు కార్యకర్త కుటుంబానికి జమ కావటానికి సహకరించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ స్థానిక టీడీపీ నాయకులకు అప్పారావు ధన్యవాదాలు తెలిపారు.

మరోమారు పసుపు రైతుల ధ్రువీకరణపత్రాల పరిశీలన

దుగ్గిరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి జరిగిన అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు ఉండి కూడా పరిహారం అందని రైతుల ధ్రువీకరణపత్రాల పరిశీలనకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు యార్డు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి జేవీ సుబ్బారావు తెలిపారు. 2024 జనవరి 19న శుభం కోల్డ్‌స్టోరేజిలో జరిగిన అగ్ని ప్రమాదంలో కోట్లాది రూపాయల పసుపు పంట అగ్నికి ఆహుతైన విషయం విదితమే. ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ జూలై 22, 23, 24 తేదీల్లో రూ.20 కోట్లకు పైగా బీమా నగదు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కొంతమంది రైతులు తమ వద్ద బాండ్లు ఉన్నప్పటికీ తమ ఖాతాల్లో నగదు జమచేయలేదని సమాచారమిచ్చారు. ధ్రువీకరణ పత్రాలు ఉండి నగదు జమ కాని రైతులు శనివారంలోపు యార్డు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

జన ఔషధి షాపులను బీసీలకు కేటాయించాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదలపై వైద్య భారం తగ్గించేలా నాణ్యమైన మందులను తక్కువ ధరకు అందించేందుకు జన ఔషధి షాపులను ప్రతి మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని, ఆ షాపుల్లో సగభాగం బీసీ నిరుద్యోగ యువతకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. జనరిక్ మెడికల్ స్టోర్లు పెట్టుకునేందుకు అర్హత కలిగిన వెనుకబడిన తరగతులకు చెందిన యువత బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 50 శాతం సబ్సిడీతో, మిగతా 50 శాతం బ్యాంకు రుణాలతో షాపులు పెట్టుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాలు మరింత మెరుగు పరిచేందుకు, మరిన్ని వైద్య కళాశాలలు, వైద్యశాలలు ఏర్పాటు చేయాలని, ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆస్పత్రిని నెలకొల్పాలను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఔత్సాహికులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● హౌసింగ్ పీడీ జీవీఎస్ఆర్‌కే ప్రసాద్

దుగ్గిరాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఔత్సాహికులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, హౌసింగ్ పీడీ జీవీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో పీడీ ప్రసాద్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కలిగి, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ప్రారంభించి పెద్దపరిశ్రమలు స్థాపించే దశకు తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వడ్లమూడి చంద్రమోహన్, ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉద్యమ రిజిస్ట్రేషన్ దోహదం చేస్తుందన్నారు.

పేద విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

మేడికొండూరు, సెప్టెంబరు 2,(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి మండలం బృగుబండ గ్రామానికి చెందిన పేద విద్యార్థిని గాడిదపాటి మౌనికకు స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచింది. మేడికొండూరు మండలం సిరిపురం కేంద్రంగా పని చేస్తున్న స్ఫూర్తి పౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ మంగళవారం 80 వేల చెక్కును అందించారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన మౌనిక గుంటూరులోని వీవీఐటీ కళాశాలలో ఉచిత సీటు పొందగలిగింది. మౌనిక తల్లిదండ్రులు లక్ష్మయ్య ఆయన భార్య కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మౌనిక కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ఈ ఏడాది ఖర్చుల కోసం రూ.80వేలను ఆర్థిక సాయంగా అందించింది. ఫౌండేషన్ ప్రతినిధి కడియాల శివప్రసాద్ ద్వారా మౌనికకు చెక్కును అందజేశారు.





రేషన్ బియ్యం తిననివారు కార్డులు తిరిగి ఇచ్చేయండి!

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం తినని వారు రేషన్ కార్డులను ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేయాలంటూ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రత్తిపాడులో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే రామాంజనేయులు చేతుల మీదగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో బియ్యం కొనుగోలుకు ప్రభుత్వం 40 రూపాయలు ఖర్చు చేసి రూపాయికి అందజేస్తుందన్నారు. మీరు రేషన్ బియ్యం తినకుండా బ్లాక్‌లో ఎనిమిది రూపాయలకు అమ్ముకోవడం వల్ల ప్రభుత్వానికి చాలా నష్టం జరుగుతుందన్నారు. ఈ రేషన్ కార్డులు కేవలం బియ్యం తీసుకోవడానికి మాత్రమే ఉపయోగపడతాయన్నారు. మరే ఇతర అవసరాలకు ఈ రేషన్ కార్డు ఉపయోగ పడదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, సివిల్ సప్లయ్ డీటీ శివశంకర్, తెలుగురైతు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి పాలన : ఎంపీపీ

దుగ్గిరాల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి పాలన కొనసాగిస్తోందని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ప్రజాపంపిణీ కోసం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రేవేంద్రపాడు, దుగ్గిరాల, చిలువూరు గ్రామాల్లో మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ జబీన్, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, యార్డు ఛైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణిల చేతుల మీదుగా మంగళవారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

● మంగళగిరి సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. కాజ గ్రామంలో తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర, పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, పీఏసీఎస్ ఛైర్మన్ గాదె పిచ్చిరెడ్డి, జనసేన, బీజేపీ గ్రామ అధ్యక్షుడు అప్పికట్ల వెంకటరత్నం నాయుడు, కారుమూరి శ్రీనివాసరెడ్డి తదితరులు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. పెదవడ్లపూడిలోని కొత్తపాలెం, లూథరన్ చర్చి రేషన్ డిపోల వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పంపిణీ చేశారు. మంగళగిరి ఒకటి, రెండు వార్డుల్లో మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర (బాబీ) ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. నవులూరు ఉడాకాలనీలో, మంగళగిరి సాయి నగర్‌లో స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.

● **తాడేపల్లిటౌన్:** తాడేపల్లి పట్టణం, పెనుమాక, పోలకంపాడులో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో అంద జేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ సీతారామయ్య, కొల్లి శేషు, వల్లభనేని వెంకట్రావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు



జనసేన కేంద్ర కార్యాలయం వద్ద కేకు కట్ చేసిన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళగిరిలో కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేకును ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్, జనసేన మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు కట్ చేశారు. మంగళగిరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి, జనసేన నేత కంకణాల శంకర్ గణపతి నగర్ ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎర్రబాలెం అమ్మ ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదానం నిర్వహించారు. ఎర్రబాలెంలో ఏర్పాటు చేసిన కేకును చిల్లపల్లి శ్రీనివాసరావు కట్ చేశారు. నూతక్కి గ్రామంలోని మాతృఛాయ ఆశ్రమంలో చిర్రావూరు గ్రామ జనసేన కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులకు అల్పాహారం, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కోమలి ఆధ్వర్యంలో చిన్నారులకు భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. చిట్టెం అవినాష్ ఆధ్వర్యంలో బ్యాంకు కాలనీలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు బహూకరించారు.

● దుగ్గిరాల మండలం ఈమనిలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కూటమి, జనసేన నాయకులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఈమని సెంటర్లోని లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసి కేకును చిల్లపల్లి శ్రీనివాసరావు కట్‌చేశారు.

● తాడికొండ(లాం)సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా లాంలో జనసేన పార్టీ నాయకులు పవన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసి అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

● ఫిరంగిపురంలో జనసేన మండల ఉపాధ్యక్షుడు విజయకుమార్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బేతపూడి విజయ శేఖర్ హాజరై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో బాధితులకు రక్తం అవసర మవుతుందని, దాతల నుంచి సేకరించిన రక్తాన్ని వారి ప్రాణాలను కాపాడవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమం అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సందీప్, శామ్యూల్ రాజు, కళ్యాణ్, పవన్, బాలకిరణ్, గుంటూరు జనరల్ ఆస్పత్రి వైద్యులు రామనాయక్, శివరామకృష్ణ పాల్గొన్నారు.

● కాకుమాను మండల వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాకుమానులో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. మండల పరిధిలోని పాండ్రపాడు, కొల్లిమర్ల, కొమ్మూరు తదితర గ్రామాల్లో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఆనందోత్సాహాలను వెలుబుచ్చారు.

● గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 2: విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు పవన్ కల్యాణ్ కీలక పాత్ర పోషించారన్నారు.

స్వమిత్వ సర్వేను పరిశీలించిన పంచాయతీరాజ్ అధికారులు

దుగ్గిరాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను పంచాయతీరాజ్ అధికారులు మంగళ వారం పరిశీలించారు. దుగ్గిరాలలో సర్వేను పరిశీలించిన డివిజినల్ పంచాయతీరాజ్ డెవలప్‌మెంట్ అధికారి కుసుమ శ్రీదేవి మాట్లాడుతూ, స్వమిత్వ రెండోదశ సర్వే గ్రామాల్లో పూర్తిస్థాయిలో నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులను సమాయత్తం చేయడం జరుగుతోందన్నారు. 54 గ్రామ పంచాయతీల పరిధిలో 36 రెవెన్యూ గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. దుగ్గిరాలలో జరుగుతున్న సర్వే వివరాలను ఈవో వివేకానంద కుసుమ శ్రీదేవికి వివరించారు.

వైసీపీలో విభేదాలు

తాడికొండ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా తాడికొండ వైసీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు నియమాకాన్ని మొదటి నుంచి ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. వజ్రబాబుకు వ్యతిరేకంగా ఓ వర్గం గతంలో గుంటూరులో సమావేశాన్ని నిర్వహించింది. అయితే పార్టీ పదవులు కేటాయింపులో కూడా వజ్రబాబు సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వకుండా తన ఇష్టానుసారం పదవులు కట్టబెట్టారని బహిరంగంగా మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వజ్రబాబు ఫోటోలు లేకుండా ఓ వర్గం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల వజ్రబాబు సీనియర్లకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని, ఇదే విషయాన్ని జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. పార్టీలోని నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మారెడ్డి, జడ్పీటీసీ కందుల సిద్దయ్య, వైస్ ప్రెసిడెంట్ ఉయ్యూరు వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జీతాలు ఇస్తేనే పారిశుధ్య పనులు చేసేది

● కార్మికుల ఆందోళన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా రూపాయి జీతం కూడా ఇవ్వకపోతే మేమెలా బతకాలంటూ ప్రత్తిపాడు గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ్య సిబ్బంది జీతాల కోసం పారిశుధ్య సిబ్బంది మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వకపోగా నెల రోజుల నుంచి ఇదిగో ఇస్తున్నాం.. అదిగో ఇస్తున్నాం అంటూ తిప్పుకుంటున్నారంటూ ఆరోపించారు. జీతాలు ఇస్తేనే పనులు చేసేది అంటూ తేల్చి చెపుతున్నారు.

డ్రోన్ల పంపిణీ

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందనడానికి ఇటీవల సంక్షోభంలో ఉన్న మామిడి, టమాట రైతులను ఆదుకున్న సందర్భాలే నిదర్శనమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామంలో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, వింజనంపాడు, సౌపాడు, అనంతవరప్పాడు గ్రామాల రైతు గ్రూపులకు డ్రోన్‌ల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఎంబీబీఎస్ విద్యార్థినికి రూ.70 వేల సాయం



సాహిత్యకు ఆర్థికసాయం అందజేస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి భార్గవపేటకు చెందిన వెనిగళ్ల రామమోహన్ కుమార్తె సాహిత్య రాష్ట్ర స్థాయి నీట్ (ఎంబీబీఎస్)లో 800వ ర్యాంకు సాధించి గుంటూరు మెడికల్ కళాశాలలో కన్వీనర్ కోటాలో ఫ్రీ సీటు సాధించింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రామ్మోహన్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న మంగళగిరి పట్టణ పద్మశాలీయ బహుత్తమ సంఘం ప్రతినిధులు విద్యార్థిని సాహిత్య చదువు నిమిత్తం ఆర్థిక చేయూతను అందించారు. నాంచారమ్మ ప్రాంగణంలోని శ్రీ భద్రావతి సమేత భావనారుషి దేవాలయం వద్ద మంగళవారం సాహిత్యకు రూ.70 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్రనాథ్, చిరంజీవి, తాటిపాముల లక్ష్మీపెరుమాళ్లు, మునగపాటి నాగసురేష్, దామర్ల శోభన్ తదితరులు ఆర్థికసాయం అందించేందుకు తోడ్పాటును అందించారు.









అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికపై చర్చలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికపై కూటమి నేతలు మంగళవారం చర్చలు జరిపారు. అర్బన్ బ్యాంకులో అధ్యక్ష పదవితో పాటు 12 డైరెక్టర్ పదవులు, కో-ఆప్షన్ సభ్యుల పదవులు ఉన్నాయి. టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా మంగమూరి హరిప్రసాద్‌ను ఖరారు చేసి, జనసేనకు నాలుగు డైరెక్టర్ పదవులు, బీజేపీకి ఒకటి ఇవ్వాలని సూత్రప్రాయంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ నెల 7న నామినేషన్లు స్వీకరించి అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. కాగా టీడీపీలోనే మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. పోటీ అనివార్యమైతే ఈ నెల 14న ఎన్నిక జరుగుతుంది.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు శివసాంబిరెడ్డి

ఉద్యమాలతోనే హక్కులు సాధించుకోవచ్చు

● సీఐటీయూ నాయకుడు శివసాంబిరెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల ద్వారానే హక్కులు సాధించుకోవచ్చునని సీఐటీయూ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మున్నంగిలో ఆశా వర్కర్లుతో సీఐటీయూ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. అనంతరం ఆషా వర్కర్స్ మండల అధ్యక్షురాలుగా శివలీల, కార్యదర్శిగా జయప్రద, ఉపాధ్యక్షులుగా పద్మసాయి, శకుంతల, కోశాధికారిగా తిరుపతమ్మను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షురాలు జి.రమణ

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

● ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ

పెదకాకాని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోవడం సాధ్యపడుతుందని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి.రమణ అన్నారు. ఆశా డే సందర్భంగా మంగళవారం పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ఆశ వర్కర్లతో ఆమె మాట్లాడారు. సుదీర్ఘ పోరాటంతోనే ఆశ వర్కర్ల వేతనాలపెంపు సాధ్యపడిందని గుర్తు చేశారు. దాదాపు ఆరేళ్ల క్రితం ఆశ వర్కర్ల వేతనాన్ని పెంచారని, ప్రస్తుతం నిత్యాసరాల ధరలు గణనీయంగా పెరిగీన నేపథ్యంలో వారి వేతనాలు కనీసం రూ.20వేలకు పెంచాలని, వారికి శాశ్వత ఉద్యోగులకు వర్తింపజేసే సాధారణ శలవులు, ప్రసూతి శలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పీహెచ్సీ కమిటీ ఎన్నుకున్నారు అధ్యకురాలుటీ సీతారామ ప్రధాన కార్యదర్శి కె కుసుమకుమారి, ఉపాధ్యక్షులు కే కీర్తి, సహాయ కార్యదర్శి టి నాగలక్ష్మి, సహకార దర్శి కేకుమారి, పి.రాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని డ్వాక్రా ఏపీఎం రాజును అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

డ్వాక్రా ఏపీఎం రాజుకు కలెక్టర్ అభినందనలు

పెదకాకాని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని డ్వాక్రా ఏపీఎం బచ్చుల రాజుకు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ప్రత్యేక అభినందనలు మంగళవారం తెలిపారు.పెదకాకాని మండలం పొదుపు మహిళా సభ్యులు నుంచి పది రూపాయలు లెక్కన 72250 రూపాయలు సైనిక వెల్ఫేర్ ఫండ్ కి కలెక్టర్ ద్వారా అమౌంట్ పంపించటం జరిగింది. దానికి గాను గుంటూరులో జరిగిన సమావేశంలో రాజుకు ప్రశంసాపత్రం, అవార్డు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

విద్వేష రాజకీయాలు విడనాడాలి: అందే దిలీప్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు విద్వేషపూరిత రాజకీయాలను విడనాడాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అందే దిలీప్ మంగళవారం అన్నారు. బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాధవ్ సందర్భం వచ్చినప్పుడల్లా రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీపై రాహుల్ వ్యాఖ్యలను వక్రీకరించి మహిళా మోర్చా నేతలను రాహుల్ దిష్టిబొమ్మలు దహనం చేయాలని పిలుపు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారంచేసిన రోజునే లెనిన్ సెంటర్ పేరు మార్చాలని మాధవ్ మాట్లాడటం ఆయన వైఖరిని తెలియజేస్తుందన్నారు.

రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతాం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం రేషన్ కార్డు లబ్ధిదారులకు నూతన స్మార్ట్ కార్డులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం వినియోగించేలా కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని తెలియజేశారు. గతంలో బొమ్మల ప్రభుత్వం ఉండేదని వైసీపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల లబ్ధిపై నాటి ముఖ్యమంత్రి, ఆయన తండ్రి బొమ్మలు వేసి పంపిణీ చేసేవారని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం ఆ సంస్కృతిని తొలగించి కేవలం ప్రభుత్వ చిహ్నాలు లబ్ధిదారుల వివరాలు మాత్రమే ఉండేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని కొనియాడారు. స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. రాష్ట్రంలో రేషన్ కార్డుల కోసం నూతనంగా చేసుకున్న దరఖాస్తులన్నిటినీ పరిష్కరించి నూతన కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. పొన్నూరు నియోజకవర్గంలో నూతనంగా 2280 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్డుల పంపిణీ సందర్భంగా రేషన్ దుకాణాల నిర్వాహకులు కూడా అక్రమాలకు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరికలు జారీ



లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

చేశారు. రేషన్ మాఫియాకి పాల్పడుతూ పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు కూడా రేషన్ మాఫియా విషయంలో ఉదాసీనంగా ఉంటే ఊరుకోమని హెచ్చరించారు. రేషన్ మాఫియాలో చివరికి తమ పక్కన ఉన్న వారు కూడా అక్రమాలకు పాల్పడితే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి పాలకులు రేషన్ మాఫియాపై ఆధారపడి పేదల బియ్యాన్ని పక్కదారి పట్టించి జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కానీ తమకు ఆ అవసరం లేదని పేదలకు అందాల్సిన రేషన్ వారికి సక్రమంగా అందితే సరిపోతుందన్నారు.

ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుదారుడికి సరుకులు అందించేలా నెలంతా రేషన్ దుకాణం తెరిచి ఉంచేలా ఉత్తర్వులు జారీ చేసిందని వెల్లడించారు. లబ్ధిదారులు తమకు నచ్చిన దుకాణంలో తమకు వీలున్న సమయంలో రేషన్ పొందే వెసులుబాటు ఉందని వివరించారు. ప్రభుత్వం ఉన్నతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వాటికి గండి కొట్టే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు రాజకీయ లబ్ధికోసం వైసీపీ పాలకులు 60 ఏళ్ల పైబడిన వృద్ధుల పింఛను నగదు బ్యాంకు ఖాతాలో వేసి వృద్ధులను తీవ్ర ఇబ్బందులు గురిచేశారని ఆరోపించారు. కానీ కూటమి ప్రభ్వుంలో ఉన్న అధికార యంత్రాంగమే ఇంటింటికీ వెళ్లి నెల మొదటి రోజునే దాదాపుగా పింఛన్లు లబ్ధిదారుల ఇళ్లకే అందిజేస్తున్నట్లు తెలిపారు. భర్త చనిపోయిన వెయ్యిమంది మహిళలకు నూతనంగా పింఛన్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, తహసీల్దార్ జియావుల్ హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, రేషన్‌కార్డు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలందరూ బాగుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

● రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

కొల్లిపర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలందరూ బాగుండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అత్తోట స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో తొలిసారిగా క్యూఆర్‌కోడ్‌తో కలిగిన రేషన్‌కార్డులను వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 46లక్షల మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేయడం జరిగిందన్నారు. స్మార్ట్ రేషన్‌కార్డు ద్వారా రాష్ట్రంలో ఎక్కడైన లబ్ధిదారులు రేషన్‌ను తీసుకోవచ్చునన్నారు. తెనాలి నియోజకవర్గంలో 48వేల కుటుంబాలకు, అదే విధంగా జిల్లాలో 5లక్షల 85వేల మందికి క్యూఆర్‌కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది రైతుల వద్ద నుండి ప్రభుత్వం ప్రతి గింజను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గత సంవత్సరం ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి 24 గంటలలోపు వారి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. త్వరలో రైతులకు సబ్సిడీపై టార్పన్ పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 29వేల 762 చౌక దుకాణాలు ద్వారా రానున్న రోజుల్లో వీటిని మినీ మార్ట్‌లుగా తీర్చిదిద్ది వాటి ద్వారా రేషన్ లబ్ధిదారులకు తక్కువ ధరలకు ఆర్గానిక్ సరుకులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో నిత్యావసరాలు అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగపుణ్యేశ్వరరావు, ఉపసర్పంచ్ దివ్వెల ఏడుకొండలు, ఏవో శ్రీనివాసరెడ్డి, నాయకులు కె.అంజనేయులు, డి.నరసయ్య, ఎ.నారాయణరెడ్డి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.



అత్తోటలో స్మార్ట్ రేషన్‌కార్డులను అందజేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



సోమసుందరపాలెంలో జనసేన జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి మనోహర్

పవన్ పుట్టినరోజు అభిమానులకు పండుగే

● మంత్రి మనోహర్ ● భారీ కేక్ కట్ చేసి జనసేన జెండా ఆవిష్కరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు అభిమానులకు పండుగేనని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు, కార్యకర్తల సమక్షంలో మంగళవారం బోసురోడ్డులోని జనసేన కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. సోమసుందరపాలెంలో జనసేన జజెండా ఆవిష్కరించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులను పరామర్శించి వారికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీలో చేరిన వారికి కండువా కప్పి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన వైసీపీని గద్దె దింపడానికి పవన్‌కళ్యాణ్ ప్రముఖ పాత్ర పోషించారని, ప్రజల ఆలోచనకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే గొప్పనాయకుడని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయితీలు నిర్వీర్యం అయ్యాయని, గ్రామ ప్రజా ప్రతినిధులు ఉత్సవ విగ్రహాలుగా మారారని, ఈ పరిస్థితులను పూర్తిగా మార్చివేసి గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా పాలన చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● తెనాలి క్రైం: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెనాలి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణరావు సహకారంతో శ్రీశివలింగేశ్వరస్వామి భక్త సమాజం భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

● పొన్నూరు టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మంగళవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో స్థానిక వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఈ వేడుకలకు హాజరై కేకును కోసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు తదితరులతో పాటు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. అలాగే రాధా రంగా మిత్ర మండలి అధ్యక్షుడు యన్నం నాయుడు ఆధ్వర్యంలో ఐలాండ్ సెంటర్‌లో పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారీ కేకును కోసి అభిమానులకు పంచిపెట్టి బాణాసంచా కాల్చి సందడి చేశారు. జనసేన నాయకుడు శంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. నిడుబ్రోలు గోతాల స్వామి ఆశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, ఆహారం అందించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ మండల అధ్యక్షులు షేక్ కరిముల్లా, నాగిశెట్టి సుబ్బారావు, అధికార ప్రతినిధి వల్లంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

● ఏఎన్‌యూ: పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏ శివప్రసాదరావు, రాధాకృష్ణ, జనసేన విద్యార్థి విభాగ అధ్యక్షుడు బండ్రెడ్డి జగదీశ్, టీఎన్‌టీయూసీ నాయకులు ఎన్‌వీ రమణ, విష్ణు ప్రసాద్, ఏఎన్‌యూ డైలీ వేజ్ యూనియన్ నాయకులు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, కూటమి నేతలు

వైఎస్సార్ పథకాలు జనరంజకం

● వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు జనరంజకమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని పాత బస్టాండ్ సెంటర్, కొలకలూరులో మంగళవారం ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయన ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్ విధానం అన్ని ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయంటే దాని వలన ప్రజలకు మేలు జరగడమేనన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ నాయకులు దేసు శ్రీనివాసరావు, కఠారి హరీష్, దుబాయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి మంచి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, ద్వారక శ్రీనివాస్, మల్లవరపు ప్రసాద్, పూర్ణచంద్రరావు, శివకుమార్, ప్రభాకర్, స్టీవెన్‌బాబు, శంకరరావు, కార్తీక్ పాల్గొన్నారు. కొండవీటి సేవా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద వైసీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.సంజీవరెడ్డి, బాలకోటిరెడ్డి, చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీమన్నారాయణరెడ్డి పాల్గొన్నారు.



మునిపల్లెలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అంబటి మురళి, తదితరులు

● కొల్లిపర: మండలంలో వైఎస్సార్ 16వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వల్లభాపురం, కొల్లిపర తదితర గ్రామాల్లో పర్యటించి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీకాలనీలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, జిల్లా కార్యదర్శి జొన్నల శివారెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉపసర్పంచ్‌లు అవుతు కృష్ణారెడ్డి, వైసీపీ కన్వీనర్ కల్లం వెంకటప్పారెడ్డి, వైసీపీ నాయకులు బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, ఆరిగ అర్జున్‌రెడ్డి, ఆరిమండ కృష్ణారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, భీమవరపు సుబ్బారెడ్డి, చెంచల రామిరెడ్డి, బొమ్ము శ్రీనివాసరెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కొల్లిపరలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

● పొన్నూరు టౌన్: వైసీపీ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మామిళ్ళపల్లి, మునిపల్లె, తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే చేబ్రోలు మండలంలో పలు గ్రామాల్లో జరిగిన వైయస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆహారంలో మార్పులే అనారోగ్యానికి కారణం: డాక్టర్ రామ్‌కిషోర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆహారంలో మార్పులే అనారోగ్యానికి కారణాలు అవుతున్నాయని కార్డియాలజిస్టు డాక్టర్ వై.రామ్‌కిషోర్ చెప్పారు. మంగళవారం జరిగిన వాకర్స్ క్లబ్ సమావేశంలో గుండెపోటుకు కారణాలు-నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై మాట్లాడారు. ఆహారంలో మార్పు వలనే 30ఏళ్ల లోపే గుండెపోట్లు వస్తున్నాయన్నారు. ఇతర దేశాల్లో కంటే మన దేశంలో బీపీ, షుగర్ వ్యాధి పదేళ్ల ముందే వస్తుందన్నారు. ఆహార అలవాట్లలో మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందని, నడక, వ్యాయామం తప్పనిసరి చేయాలని సూచించారు. సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి, కడియాల రవి, ఆనందయ్య, నరసయ్య, మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.



డాక్టర్ రామ్‌కిషోర్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు



కొల్లిపర శ్రీవీరభద్రస్వామికాలనీలో వినాయక విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

కొల్లిపర, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకల్లో భాగంగా మంగళవారం గణేష్ నిమజ్జనోత్సవాలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలో వల్లభాపురం, మున్నంగి, తూములూరు, అత్తోట, దావులూరు, కొల్లిపర తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు భక్తులు వారం రోజుల నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై విగ్రహాన్ని ఉంచి గ్రామాల్లో కనక తప్పెట్లు, బాణసంచా కాల్చుతూ గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



దొప్పలపూడిలో నిమజ్జనానికి తరలివెళుతున్న గణనాథుడితో మహిళలు

● పొన్నూరు టౌన్: మండల పరిధిలోని దొప్పలపూడిలో మంగళవారం గణనాథుడి నిమజ్జనం కోలాహల వాతావరణంలో జరిగింది. గ్రామంలోని కొత్తపేట రామాలయం వీధి సెంటర్లో ఏర్పాటుచేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై గణనాథుని ప్రతిష్టించి గ్రామోత్సవం జరిపారు. నిమజ్జనం సందర్భంగా గణనాథుడి లడ్డూ వేలం పాటలో కన్నెగంటి రమేష్‌బాబు రూ.82వేలకు లడ్డూను దక్కించుకున్నారు. గ్రామానికి చెందిన పాతూరు శ్రీనివాసరావు, దొప్పలపూడి సాంబశివరావు, కొమ్మినేని భూషయ్య, కందేపి కిషోర్ బాబు, తదితరుల ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు జరిగాయి. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



వరి నాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కాండం తొలిచే పురుగుల నివారణ చేపట్టాలి

● ఏవో వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో నారు కొనలు తుంచి నాటుకోవడం ద్వారా కాండం తొలిచే పురుగు నివారణ సాధ్యమవుతుందని ఏవో ఆరు వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని మాచవరం, ములుకుదురు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వరి నాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. నారు కొసల చివరన కాండం తొలిచే పురుగు తల్లి గుడ్లను కొన్ని వందల సముదాయాలుగా పెడతాయని కొసలు తుంచి నాటడం ద్వారా పురుగు నివారణను గుడ్డు దశలోనే అరికట్టవచ్చని సూచించారు. కాలిబాటలు తీసుకోవడం ద్వారా సుడిదోమను నివారించుకోవచ్చని సూచించారు. దీనివల్ల పైరుకు గాలి వెలుతురు బాగా సోకి తెగుళ్లు రాకుండా కాపాడవచ్చన్నారు. రైతుల సూచనలకు అనుగుణంగా మాత్రమే ఎరువుల వినియోగం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సరైన పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

● డాక్టర్ ప్రియాంక



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

తెనాలి క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గర్భిణీగా ఉన్న సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. మంగళవారం ఆశా దినోత్సవం సందర్భంగా నందులపేట ఆరోగ్య కేంద్రంలో గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాహారాలు గురించి వివరించారు. ఆకు కూరలు, కాయ కూరలు, పండ్లు, పాలు, కోడిగుడ్లు, పప్పు ధాన్యాలు వంటి వాటి ద్వారా ఖర్చుతోనే మంచి పోషకాలు అందుకోవచ్చన్నారు. దీని వలన తల్లిబిడ్డ ఆరోగ్యకరంగా ఉండటమే కాక పుట్టిన బిడ్డకు పాలు కూడా సమకూరతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహార పదార్థాలను గర్భిణులు తప్పక వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ, వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, మురుగునీటి నిల్వలు ఏర్పడకుండా, పరిసరాలు శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అందె బాలచంద్రమౌళి, ఆరోగ్య కార్యదర్శులు, హెల్త్ విజిటర్స్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



డాక్టర్ రామ్‌కిషోర్‌ను గోల్డ్‌మెడల్‌తో సత్కరిస్తున్న వైద్యులు

డాక్టర్ రామ్‌కిషోర్‌కు డాక్టర్ దక్షిణామూర్తి గోల్డ్‌మెడల్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడి డీవీసీ ఆసుపత్రి కార్డియాలజిస్టు వై రామ్‌కిషోర్‌కు సీనియర్ వైద్యులు పాటిబండ్ల దక్షిణామూర్తి గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. బోసురోడ్డులోని ఐఎంఏ హాలులో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో గుండెనొప్పిలో వైద్యులు తీసుకోవాల్సిన వైద్య విధానాలను వివరించారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా డాక్టర్ దక్షిణామూర్తి కార్డియాలజి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. 86వ ఏట ప్రవేశించిన ఆయన రోగులకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఐఎంఏ అధ్యక్షులు అనీల్‌కుమార్, వైద్యులు వేమూరి శేషగిరిరావు, చందు సాంబశివుడు, మధు ప్రభాకరరావు, విజయలక్ష్మి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.